తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్ట ప్రకారం నేరం!

**-భ్రూణ హత్యలకు అడ్డుకట్ట వేయాలి -సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనన్**



గూడూరు, అక్టోబర్ 18 ప్రభాతవార్త : గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్ట ప్రకారం నేరమని, భ్రూణ హత్యలకు అడ్డుకట్ట వేయాలని సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనన్ పేర్కొన్నారు. శుక్రవారం గూడూరులోని సబ్ కలెక్టర్ చాంబర్‌లో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం అమలుపై డివిజన్ స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో స్త్రీ, పురుషులు ఇద్దరు సమానమే అని ఆడపిల్లల పట్ల వివక్షత ఉండకూడదని తెలిపారు. గర్భస్థ నిర్ధారణ చట్టంను కఠినంగా అమలు చేయడం ద్వారా భ్రూణ హత్యలను నివారించవచ్చని అన్నారు. ప్రతి నెల అన్ని స్కానింగ్ పరీక్షలు పాల్గొంటున్న స్కానింగ్ సెంటర్ల వారి రిజిస్ట్రేషన్ తొలగించడం జరుగుతుందని అన్నారు. స్కానింగ్ సెంటర్లో రిజిస్ట్రేషన్, రెన్యువల్, ఇతర మోడిఫికేషన్ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో మాత్రమే స్వీకరించడం జరుగుతుందన్నారు. అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్ మార్పులన్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వారి అనుమతి తప్పనిసరిగా పొందాలని తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయని సమాచారం తెలిసిన వారు 102, 104 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి తెలియజేయవచ్చని తెలిపారు. అందువల్ల ప్రజలలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం పై అవగాహన పెంచేలా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ డా. పద్మావతి, డిఈఎంఓ బాబు, నెహ్రూ రెడ్డి, సిడిపిఓ మెహబూబీ, సిబ్బంది పాల్గొన్నారు.

# పేదలకు మెరుగైన... నాణ్యమైన వైద్యం

**-వైద్య ఆరోగ్య సిబ్బంది, ఇంజినీరింగ్ అధికారులతో జిల్లా కలెక్టర్**

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 18 ప్రభాతవార్త : పేదలకు మెరుగైన, నాణ్యమైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం ఎస్వీ వైద్య కళాశాల పాలన భవనం కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ చైర్మన్ హోదాలో అధ్యక్షత వహించి, స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాసులు కో చైర్మన్ హోదాలో, బి. లక్ష్మీపతి సభ్యులుగా సంబంధిత కమిటీ సభ్యులతో సమీక్షలో పాల్గొని రుయా ఆసుపత్రి సొసైటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్యులు వారి సిబ్బంది, ఇంజనీర్లు, ఇతర అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అప్పుడే ఆసుపత్రి పేద రోగులకు అండదండగా వుంటుందని తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ సమావేశం గత ఒకటిన్నర సంవత్సరం నిర్వహించలేదని అధికారులు తెలుపగా తాను కలెక్టర్‌గా ఉన్న నాటి నుండి ఇది రెండో సమావేశం అని, ఇక నుండి క్రమం తప్పకుండా సమావేశం నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ రవి ప్రభు మెంబర్ కన్వీనర్ హోదాలో ముందుగా గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై తీసుకున్న చర్యలను కమిటీకి వివరించారు. అనంతరం అజెండా అంశాలపై కమిటికి నివేదించారు. కమిటీలో మునుపటి సమావేశం జూన్ 6వ తేది తీసుకున్న తీర్మానాలు స్థితిని తిరిగి సమీక్ష నిర్వహించగా ఆక్సిజన్ పైప్‌లైన్‌ల నిర్వహణకు టెండర్లను ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎపిఎంఎస్ఐడిసి పిలవడం జరిగిందని పలు అంశాలపై తీసుకున్న చర్యలను తెలిపారు. మహాప్రస్థానం వాహనాలకు సంబంధించి 3 వాహనాలను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారు కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ నిధుల నుండి అందించుటకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. అనంతరం శుక్రవారం జరిగిన సమీక్షలో ముఖ్యంగా 11 సిసి కెమెరాలను ఎపిఎంఎస్ఐడిసి, క్షయ, ఛాతి వ్యాధుల వార్డు, చిన్న పిల్లల హాస్పిటల్ బ్లాక్ దారిలో అమర్చుటకు ఆమోదం తెలిపారు. 4 ఆర్ఓ ప్లాంట్స్ ఆపరేషన్ థియేటర్లలో, ల్యాబ్‌ల దగ్గర ఏర్పాటు చేయుటకు 95000 రూపాయిలు, ఎన్టీఆర్ వైద్య సేవ నిధుల నుండి కొనుగోలు చేయుటకు ఆమోదించారు. ఆసుపత్రిలో ఉన్న దుకాణాలకు టెండర్ కాల పరిమితి అక్టోబర్ 17వ తేదిన ముగిసింది. ఇప్పుడు ఉన్న దుకాణాలు ఖాళీ చేయుటకు, కొత్త టెండర్స్ నిర్వహించుటకు, హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ అకౌంట్స్ ఆడిట్ చేయుటకు చార్టెడ్ అకౌంటెంట్‌ను సేవలు వినియోగించుకొని దానికి ఖర్చు హెచ్‌డిఎస్ నిధుల నుండి మంజూరు చేయుటకు ఆమోదించారు. చిన్న పిల్లల ఆసుపత్రిలో ఎస్ఎన్‌సియు, ఎన్ఐసియు, పిఐసియు, ఎన్ఆర్‌సి విభాగాలకు పది ఎయిర్ కండిషనర్లు కొనుగోలు చేయుటకు ఆమోదము తెలుపుతూ, హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ నిధులు తక్కువగా ఉండడం వలన వీటిని కాలేజీ డెవలప్మెంట్ నిధులు నుంచి కొనుగోలు చేయాల్సిందిగా కమిటీ నిర్ణయించింది. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ ఎన్. మౌర్య, హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ సభ్యులు లక్ష్మీపతి, డా. పిఎ చంద్రశేఖరన్, ఎస్వి మెడికల్ కళాశాల పిన్సిపల్, ఎం. శివరామిరెడ్డి, ఎపిఎంఎస్ఐడిసి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డా. యు. శ్రీహరి, తిరుపతి జిల్లా ఆరోగ్య వైద్యాధికారి, డా. ఎస్. ఆనంద మూర్తి, అన్ని విభాగాల హెచ్ఓడిలు, ఏ1 శానిటేషన్ ఏజెన్సీ, ఎక్స్‌పర్ట్ సెక్యూరిటీ సర్వీసెస్, నెఫ్రో ప్లస్, ప్రమోదిని ఏజెన్సీలు, నర్సింగ్ సూపరింటెండెంట్, సిరిక్స్ ఏజెన్సీ, బయోమెడికల్ ఇంజనీర్, జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ఎస్వీ వైద్య కళాశాల పాలన భవనం కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులకు సూచనలు ఇస్తున్న జిల్లా కలెక్టర్

# కాణిపాకంలో మహాప్రాకారం

**రూ.100 కోట్లతో...**

**-భూసేకరణకు 50 కోట్లు, ప్రాకార నిర్మాణానికి మరో 50 కోట్లు -ప్రణాళికలు సిద్ధం**



కాణిపాకం, అక్టోబర్ 18 ప్రభాతవార్త: సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో ప్రధాన ఆలయంతో పాటు పరివార ఆలయాలను ఒకే ప్రాంగణంలోకి తీసువచ్చేందుకు సుమారు 100 కోట్లు రూపాయల వ్యయ అంచనాలతో మహాప్రాకారం నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. వెయ్యేళ్ళ చరిత్ర కలిగిన సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం స్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం ప్రధాన ఆలయం విస్తరణ, పునర్నిర్మాణ పనులతో పూర్తిగా రూపు రేఖలు మారి శిల్పశోభితం తయారైంది. కాణిపాకం ఆలయంలో పెరుగుతున్న భక్తుల రద్దీ దృష్ట్యా సుమారు 10 కోట్లు రూపాయల వ్యయ అంచనాలతో గత రెండేళ్ళ క్రితం దాతల సహకారంతో ఆలయ పునఃనిర్మాణ, విస్తరణ పనులు చేపట్టి పూర్తి చేశారు. అలాగే ప్రధాన ఆలయ ప్రాంగణంలోనే మరో కోటి రూపాయల వ్యయ అంచనాలతో దాతల సహకారంతోనే నూతన అద్దాలమండపంను కూడా నిర్మించారు. నూతన ఆలయం ప్రారంభమైనప్పటి నుండి స్వామివారి దర్శనార్థం వచ్చే భక్తుల సంఖ్య అనూహ్యంగా పెరుగుతూ వస్తోంది. ఈమేరకు రోజూ సరాసరి 25 వేల నుండి 30 వేల మంది వరకు భక్తులు స్వామివారి దర్శనార్థం వస్తుంటారు. ఈనేపథ్యంలో భక్తుల వసతి సౌకర్యాల కల్పనకు దేవస్థానం మాస్టర్ ప్లాన్ అమలు చేస్తోంది. ఇందులో భాగంగా భక్తులకు ప్రాధాన్యతా ప్రాతిపదికన కోట్లాది రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. అలాగే ఈపనులు దాదాపు పూర్తి కావస్తుండడంతో మహా ప్రాకారం నిర్మాణానికి దేవస్థానం సమాయత్తమవుతోంది. ప్రధాన ఆలయంతో పాటు, పరివార ఆలయాలైన శ్రీమరగదాంభిగా సమేత మణికంఠేశ్వరాలయం, శ్రీశ్రీదేవి భూదేవి సయిత పెరిందేవి సమేత వరదరాజస్వామి ఆలయంలను ఒకే ప్రాంగణంలోకి తీసుకువచ్చేందుకు వీలుగా ఈమహాప్రాకారం నిర్మించడానికి ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. మహాప్రాకారంతో పాటు నాలుగు వైపులా నాలుగు రాజగోపురాలు నిర్మించనున్నారు. ప్రాకారం లోపుల నాలుగు మాఢావీదులను ఏర్పాటు చేయనున్నారు. మహాప్రాకారం చుట్టూ 100 అడుగుల రోడ్డు ఏర్పాటు చేయడానికి చర్యలు చేపడుతున్నారు. ఇందుకోసం దేవస్థానం దుకాణ సముదాయాన్ని పూర్తిగా తొలగించనున్నారు. అలాగే ఆలయ పరిసరాల్లో ప్రయివేటు వ్యక్తుల నుండి సుమారు ఐదు ఎకరాల స్థలాన్ని భూసేకరణ ద్వారా సేకరించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆలయం చుట్టు పక్కల నివాసమున్న ఇళ్ళు వాణిజ్య సముదాయాలు, హోటళ్ళు, రెస్టారెంట్‌లు, దుకాణ సముదాయాలను భూసేకరణ ద్వారా సేకరించడానికి ప్రతిపాదనలు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. న్యాయపరమైన సమస్యలు తలెత్తకుండా భూసేకరణ పూర్తిగా నెగోషియేషన్( చర్చల) ద్వారా చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇందుకోసం భూసేకరణ బాధితులకు స్థలాలు, కట్టడాలకు నష్టపరిహారంగా ప్రస్తుత మార్కెట్ విలువకు ఐదు నుండి ఏడు రెట్లు వరకు ధర ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇందుకోసం సుమారు 50 కోట్లు వరకు ఖర్చవుతుందని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అలాగే మరో 50 కోట్లు రూపాయలు మహాప్రాకారం నిర్మాణం కోసం ఖర్చవుతుందని అంచనాలు సిద్ధం చేశారు. ఈమహా ప్రాకారం నిర్మాణాన్ని కేవలం రెండేళ్ళ కాల వ్యవధిలో పూర్తిచేయాలని ఇంజనీరింగ్ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.తొలుత భూసేకరణ కార్యక్రమం పూర్తి చేసేందుకు దేవస్థానం అధికారులు కసరత్తులు చేస్తున్నారు. దేవాదాయశాఖ ఉన్నతాధికారులు ఈప్రతిపాదనలకు ఆమోదం తెలిపిన వెంటనే భూసేకరణ, మహాప్రాకారం నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు చేపట్టనున్నారు. మహాప్రాకారం నిర్మాణం పూర్తయితే తిరుమల తరహాలో కాణిపాకం ఆలయం రూపుదిద్దుకోనుంది.

# సఫాయి కర్మచారిలకు కనీస వేతనాలు

**- సఫాయి కర్మచారి కమీషన్ ఛైర్మన్ వెంకటేశన్**



సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న సఫాయి కర్మచారి కమీషన్ ఛైర్మన్

చిత్తూరు, అక్టోబర్ 18 ప్రభాతవార్త: సఫాయి కర్మచారిలకు ప్రభుత్వం నిర్ణయించిన మేరకు వేతనాలు అందించాలని సఫాయి చర్మచారి కమీషన్ ఛైర్మన్ ఎం.వెంకటేశన్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో శుక్రవారం సఫాయి కర్మచారి కమీషన్ ఛైర్మన్ ఎం.వెంకటేశన్ కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలుతో కలిసి జిల్లాలో సఫాయి కర్మచారిలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులు, అర్డీఓలు, మున్సిపల్ కమీషనర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సఫాయి కర్మచారి కమీషన్ ఛైర్మన్ మాట్లాడుతూ కార్మిలకు ఏజెన్సీల ద్వారా కాకుండా నేరుగా జీతభత్యాలు చెల్లించడం జరుగుతున్నదని, ఇది శుభపరిణామం అన్నారు. చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల జీతభత్యాల చెల్లింపులో వ్యత్యాసం వుందని, ఇక్కడ ప్రభుత్వ నిబంధనల మేరకు కనీస వేతనాలు అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఎన్ఎస్‌కెఎఫ్‌డిసి పథకంపై అవగాహన కల్పించాలని, బ్యాంకుల ద్వారా ఎలాంటి పూచికత్తు లేకుండా రుణాలు అందించేలా లీడ్ బ్యాంకు మేనేజర్‌ను ఆదేశించాలని కలెక్టర్‌ను ఆయన కోరారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు నిబంధనల మేరకు జీతాలు అందడం లేదని, ఆసుపత్రిలో వీరికి సరైన వైద్య సేవలు అందించడం లేదని, జూనియర్ డాక్టర్లు ఇక్కడ సేవలు అందిస్తున్నారన్నారు. చిత్తూరు జిల్లాలో ఇఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు చేయాలని, ఆప్కాస్ ద్వారా మున్సిపాల్టీల్లో విధులు నిర్వహిస్తున్న సఫాయి కర్మచారిలకు ఇంటి స్థలాలు కేటాయించాలని, వారికి ప్రతి నెల రెగ్యులర్‌గా జీతాలు అందించాలని, యూనిఫారం, చెప్పులు అందించాలని, ప్రతి మూడు నెలలకు ఒకసారి మెడికల్ క్యాంపు నిర్వహించేలా చూడాలని సఫాయి కర్మచారి కమీషన్ ఛైర్మన్ కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కోరారు. ఈ సమావేశంలో పలు ప్రాంతాల్లో మహిళలు విధులు నిర్వర్తించే సమయంలో ఎదుర్కొంటున్న సమస్యలను ఛైర్మన్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వీరి సమస్యలను పరిష్కరించడానికి మహిళా అధికారులతో కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ విషయం అందరికి తెలిసేలా నోటీసు బోర్డులో వుంచాలని, ఈ విషయంపై అవగాహన పెంచాలని ఛైర్మన్ కోరారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, జిల్లా సాంఘీక సంక్షేమ శాఖ అధికారిణి డాక్టర్ రాజ్యలక్ష్మీ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రభావతిదేవి, డిసిహెచ్ఎస్ డాక్టర్ ప్రభావతి, హౌసింగ్ డిఎం పద్మనాభం, ఎల్డీఎం హరీష్, అర్డీఓలు శ్రీనివాసరావు, శ్రీనివాసులు, వెంకట్‌రెడ్డిలు, చిత్తూరు మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్, సంఘ నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎవరైతే మాకేంటీ!

**- పాలసముద్రం నుండి జోరుగా తమిళనాడుకు ఇసుక అక్రమ రవాణా దందా**
**- మరోసారి ఇసుక అక్రమంగా తీసుకెళ్తు పోలీసులకు పట్టుబడిన ట్రిప్పర్**

పాలసముద్రం, అక్టోబర్ 18 ప్రభాతవార్త: ఎవరు ఎన్ని చెప్పినా పాలసముద్రం మండలం నుండి తమిళనాడు రాష్ట్రానికి ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. ఇప్పటికే రెండుసార్లు పోలీసులు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వాహనాలను పట్టుకుని సీజ్ చేసినా అక్రమార్కులు ఇసుక అక్రమ రవాణా దందాను ఆపడం లేదు. పాలసముద్రం పోలీసులకు గురువారం రాత్రి సింహరాజపురం పంచాయతీ నుండి ఇసుకను తీసుకెళ్తున్న ఒక ట్రిప్పర్ దొరికింది. ఈ ట్రిప్పర్ యాజమాని రాజా(36), ముని(30), శరవణ(30), ఎల్లప్ప(33)లపై కేసు నమోదు చేసి ట్రిప్పర్‌ను రెవెన్యూ అధికారులకు అప్పగించారు. జిడినెల్లూరు మండలంలోని నీవానది నుండి పాలసముద్రం మండలంలోని సింహరాజపురం పరిసరాల్లోకి అనునిత్యం ట్రాక్టర్లతో ఇసుకను అక్రమ ఇసుక వ్యాపారస్తులు డంప్ చేసుకుంటారు. ఇలా డంప్ చేసిన ఇసుకను రాత్రి సమయాల్లో ట్రిప్పర్ల ద్వారా తమిళనాడు రాష్ట్రానికి అక్రమంగా తరలించి లక్షల రూపాయలు ఇసుక అక్రమార్కులు దోచుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో గురువారం సైతం ఇసుక అక్రమార్కులు తమిళనాడు తిరువళ్ళూరు జిల్లా ఆర్‌కె పేట నుండి ఒక ట్రిప్పర్, ఒక జెసిబిని తీసుకువచ్చారు. ఇసుక అక్రమ డంప్ నుండి జెసిబి ద్వారా ట్రిప్పర్‌లోకి ఇసుకను లోడ్ చేసుకుని తమిళనాడుకు బయలుదేరారు. నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో ఒక్కసారిగా ఇసుక లోడ్‌తో ఉన్న ట్రిప్పర్ నేలతో దిగబడింది. ఇసుక అక్రమార్కులు ట్రిప్పర్‌లోని సగం ఇసుకను కింద పడేసి మిగిలిన ఇసుకతో బయలుదేరడానికి సిద్ధం అయ్యారు. అయినప్పటికీ కుదరలేదు. అప్పటికే ఈ విషయం స్థానికులకు తెలియడంతో వీరు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ భారతి సంఘటనా స్థలం చేరుకుని ఇసుక ట్రిప్పర్‌ను సీజ్ చేసి నలురుగు వ్యక్తులను అరెస్టు చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించారు.

# వరినాట్లుల్లో అన్నదాతలు

**-తుఫాన్, ఈశాన్య రుతుపవనాలతో వర్షాలతో రైతుల్లో అనందం**

*జిల్లాలోని తూర్పు మండలాల్లో ఈశాన్య రుతుపవనాలతో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయి. ఈ ఏడాది రైతులను సంతోష పెడుతూ ఈశాన్య రుతుపవనాలు పలకరించాయి. దీనికి తోడు బంగాళాఖాతంలో అల్పపీడనం తోడైంది. నెలాఖరు వరకు కురవాల్సిన వాన కన్నా అధికంగానే కురిసింది. వరుణుని కరుణతో అన్నదాతలు అనందంతో పొలం పనుల్లో బిజీ బిజీ అయ్యారు.*



శ్రీకాళహస్తి పరిసరాల్లో ముమ్మరంగా నాట్లు వేస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి,అక్టోబర్ 18 ప్రభాతవార్త

జిల్లాలోని తూర్పు మండలాల్లో అక్టోబర్‌నుంచి డిసెంబర్ వరకు సుమారు 1,000 మి.మీల వర్షపాతం నమోదు కావటం ఆనవాయితి. అయితే ఇటీవల సంవత్సరాల్లో రుతుపవనాల వర్షాలు కరువయ్యాయి.కేవలం బంగాళా ఖాతంలో అల్పపీడనంతో వర్షాలు కురవటం చెరువులు కుంటలు నిండుతున్నాయి. దాంతో వ్యవసాయం ఎత్తుభారంగా మారుతుంది.ఈ ఏడాది అక్టోబర్ సాధారణ సగటు వర్షపాతం కన్నా ఎక్కువ నమోదైంది. అక్టోబర్ సాధారణ సగటు వర్షపాతం 229.3 మీ.మిలు కాగా అక్టోబర్ 17 వరకు 238.5 మి.మీలు నమోదైంది. సాధారణంగా అక్టోబర్ చివరి నాలుగు రోజులు రుతుపవనాల వల్ల వర్షాలు కురుస్తాయి కానీ ఈ ఏడాది రుతుపవనాలకు అల్పపీడనం తొడవడంతో ముందుగానే వర్షాలు కురిసి చెరువుల్లో సగం నీరు వచ్చింది. స్వర్ణముఖి నదీ తీరాన గల సుమారు 100 గ్రామాల్లో నదిలో ఒక సారి నీరు పారితే తప్ప బావుల్లో ఊటరాదు..బావులు నిండవు. బోర్లలో భూగర్భజలాలు పెరగవు.దాంతో అన్నదాతలు 'స్వర్ణముఖి పారుతుందా? లేదా? అని ఎదురు చూస్తుంటారు. గత 25సంవత్సరాలుగా రుతుపవనాలతో వర్షాలు కురిసి నది పారటంలేదు. దాంతో భూగర్భ జలాలు అడుగింటిపోతున్నాయి. ఒకప్పుడు స్వర్ణముఖి నదీ తీరాన ఉన్న సన్నిధివీధి, దుర్గాంబ కొండ పరిసరాల్లో కేవలం 30అడుగుల లోతులోనే నీరు వచ్చేది. కానీ నేడు పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. నదీ తీరాన కూడ సుమారు 100 నుంచి 150 అడుగుల లోతు వెళితే తప్ప నీరు లభ్యత లేదు.దాంతో వ్యవసాయం ఎత్తుభారంగా మారుతుంది.పట్టణంలో మంచినీటి సరఫరా తెలుగు గంగపై అధారపడి ఉంది. బోర్లలో నీరు సన్నగా వస్తుంది.

**ప్రారంభమైన వరినాట్లు..**

శ్రీకాళహస్తి పరిసరాల్లోని రైతులు నార్లుపోసుకొని నాట్ల కోసం వరుణ దేవుని కరుణ ఆనందపరచింది. గత మూడురోజులుగా ఎడతెరపి లేని వానలతో వాతావరణం చల్లబడింది. పలువురు రైతులు దుక్కులు దున్నుకొని నార్లు పోసుకోవటానికి మేలైన, నాణ్యమైన విత్తనాల కోసం ఎదురు చూస్తున్నారు. దీపావళి తరువాత వ్యవసాయ పనులు వేగం పుంజుకుంటాయి.ఇప్పటికే నాట్లు పూర్తి కావాల్సి ఉంవి. రబీసీజన్లో ఈ ప్రాంతాల్లో సుమారు 32వేల హెక్టార్లలో వరి సాగు జరుగుతుంది.వరుణుడి కరుణ లేకున్నా సత్యవేడు నియోజకవర్గం లోని రైతులు తెలుగుగంగ జలాలతో నార్లు పోసుకొని నాట్లు పనులు ప్రారంభించారు.

**వర్షాలతో రోడ్లు ధ్వంసం:**

అసలే అంతంత మాత్రంగా ఉన్న రోడ్లు పరిస్థితి ఆద్వానంగా మారింది. రెండేళ్ళుగా ఇటు మున్సిపాలిటిలో కానీ అటు ఆర్అండ్‌బి శాఖ కానీ గతుకుల మయమైన రోడ్లుపై తట్టెడు మట్టి పోసిన సందర్భంలేదు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో రోడ్లు ధ్వంసం అయ్యాయి. ఎటు వెళ్ళాలో తెలియని స్థితి చోటు చేసుకుంది. మున్సిపల్ పరిధిలోని శివారు ప్రాంతాల కొత్త కాలనీల్లో అడుగుపెట్టడానికి వీల్లేని స్థితి చోటు చేసుకుంది.

# పంట కాలువలను మరమ్మతులు చేయండి

శ్రీకాళహస్తి రూరల్,అక్టోబర్ 18 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మండలంలోని 14 గ్రామాలకు సాగునీటి సదుపాయం కల్పించే తొండమనాడు చెరువు నుంచి సాగే పంట కాలువలను మరమ్మతు లు చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. రాజుల కాలం నాటి చెరువు ఇంకా మైనర్ ఇరిగేషన్ పరిధిలో ఉంది.దీనిని మీడియం ఇరిగేషన్‌లో చేర్చాలని గతంలో ఈ నియోజకవర్గం నుంచి గెలిచిన శాసనసభ్యుడు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి మంత్రిగా ఉన్నపుడు ప్రతిపాదించారు. కానీ అమలు జరగలేదు. 1999లో నారాచంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా జన్మభూమి కార్యక్రమాలను ఏర్పాటు చేసినపుడు ఈ చెరువు నుంచే శ్రీకారం చుట్టారు.తరువాత ఈ చెరువు బాగోగుల గురించి ఎప్పటికప్పుడు ప్రతిపాదనలే తప్ప ఆచరణకు నోచుకోవటం లేదు. సుమారు 28కిమీల పొడవు గల్గిన పంట కాలువలున్నాయి. వీటి మరమ్మతులు, లైనింగ్ పనులు చేయాలంటే రూ.100 కోట్లు అవసరవమౌతాయని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు.



అధ్వాన్నంగా ఉన్న కాలువలు

**నిధుల కొరత...పనులకు ఆటంకం:**

శ్రీకాళహస్తి మండలం తొండమనాడు చెరువు నుంచి శ్రీకాళహస్తి మండలంలోని చెర్లొపల్లి, ఊరందూరు, అరవకొత్తూరు, కమ్మకొత్తూరు చెరువులకు సాగునీరందిస్తుంది. అధికారిక ఇరిగేషన్ లెక్కల ప్రకారం సుమారు 5వేల ఎకరాలకు సాగు నీరందించే చెరువు బాగు కోసం నాలుగేళ్ళ ముందు జైకా నిధులు రూ.3.5కోట్లతో పనులు చేపట్టారు. ఇందులో రూ.2కోట్ల పనులు పూర్తి అయ్యాయి. కాని నిధులు మంజూరు కాకపోవటంతో కాంట్రాక్టర్ పనులు ఆపివేషారు. మిగిలిన పనులు చెరువు కట్ట పై భాగంలో మరమ్మత్తులు చేపట్టాల్సి ఉంది. కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వరన్ పర్యటించినపుడు రైతులు పంటకాలువల గురించి ఆభ్యర్థించారు. పంట కాలువలో కొన్ని సంవత్సరాల నుంచి మరమ్మతు లు. పూడిక తీయలేదు.దాంతో కాలువల్లో పిచ్చిమొక్కలు పెరిగి సజావుగా నీరు పారటం లేదు.

**వర్షాలతో రూ.2కోట్లు నష్టం: ఎస్ఇ**

తిరుపతి జిల్లాలో బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో కురిసిన ఎడతెరిపి లేని వర్షాలతో ఇరిగేషన్ శాఖ చెరువులకు సుమారు రూ.2కోట్లు నష్టం వాటిల్లి ఉండవచ్చునని ఎస్ఇ మదనగోపాల్ శుక్రవారం తెలిపారు.ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. ముఖ్యంగా వెంకటగిరి, గూడూరు పరిసరాల్లో సాగునీటి వనరులు దెబ్బతిన్నాయని వివరించారు. 37 చెరువులకు ఇబ్బంది కల్గిందని చిన్న మరమ్మత్తులు చేయాలల్సి ఉందన్నారు. అయితే మళ్ళీ వర్షాలు వచ్చినా ఇబ్బంది లేకుండా చూస్తున్నామన్నారు. కాగా కాళంగి రిజర్వాయర్ ఇంకా నిండలేదన్నారు. ఈ రిజర్వాయర్ సామర్థ్యం 222 ఎంసిఎఫ్‌టిలు కాగా 216 ఎంసిఎఫ్‌టిల నీరు చేరిందన్నారు.

# తిరుమల తరహాలోనే...

## తిరుచానూరు అమ్మవారి బ్రహ్మోత్సవాలు

**-భక్తులకు ఇబ్బంది లేకుండా వాహనాల పార్కింగ్**
**-నవంబర్ 28నుండి డిసెంబర్ 6వరకు ఉత్సవాలు**



తిరుపతి/తిరుచానూరు,అక్టోబర్ 18ప్రభాతవార్త: తిరుచానూరులో కొలువైన శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు నవంబర్ 28వతేదీ నుండి మొదలుకానున్నాయి. డిసెంబర్ 6వతేదీ వరకు జరిగే ఈ బ్రహ్మోత్సవాలను తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల తరహాలోనే జరిపించేలా ఏర్పాట్లు చేయాలని టిటిడి జెఈఓ వీరబ్రహ్మాం అధికారులను ఆదేశించారు. అమ్మవారి బ్రహ్మోత్సవాలు నిర్వహణ, ఏర్పాట్లు, సౌకర్యాల కల్పన, వాహనాల పార్కింగ్ విషయాలపై శుక్రవారం మద్యాహ్నం టిటిడి సివిఎస్ఓ శ్రీధర్, ఆలయ డిప్యూటీ ఈఓ గోవిందరాజన్,సిఇ సత్య నారాయణ, ఎస్ఇ జగదీశ్వర్‌రెడ్డి, ఎస్ఇ ఎలక్ట్రికల్ వేంకటేశ్వర్లు, విజిఓ సదాలక్ష్మి, ఇఇలతో కలసి సమీక్షించారు. అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో విశేషమైన పంచమీతీర్థానికి తిరుపతి చుట్టుపక్కల ప్రాంతాల నుండి లక్షలామంది భక్తులు విచ్చేసి పుణ్యస్నానాలు ఆచరిస్తారు. ఇందుకు భారీగా భద్రతా ఏర్పాట్లు ,ఇతర సౌకర్యాలను కల్పించాలన్నారు. తిరుచానూరు ఆలయం పరిసరాల్లో భక్తుల వాహనాల పార్కింగ్‌కు పూడిరోడ్డు, రేణిగుంట రోడ్డు, మార్కెట్‌యార్డు ప్రాంతాల్లో స్థలాలను సిద్ధం చేయనున్నారు. భక్తులు సేదదీరేందుకు వీలుగా నవజీవన్ కంటిఆస్పత్రి, జడ్పీ హైస్కూల్, పూడిరోడ్డులోని గోశాల వద్ద జర్మన్‌షెడ్లు ఏర్పాటు చేయాలని జెఇఓ వీరబ్రహ్మాం ఆదేశించారు.

## మైనర్ బాలికను గర్భవతిని చేసిన మాజీ వాలంటీర్!

**శాంతిపురం, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** పాఠశాలకు వెళ్తున్న ఓ మైనర్ బాలికను వంచించి మాయమాటలు చెప్పి ఆ బాలికను గర్భవతిని చేసిన ఓ మాజీ వాలంటీర్ ఘనకార్యం మండలంలోని రాళ్లబూదుగూరు పంచాయతీ శెట్టిగానికురు బూరులో చోటు చేసుకుంది. ఈమేరకు బాధిత కుటుంబం పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం. బాధితుల కథనం మేరకు వివరాలిలా.. గ్రామానికి చెందిన మునిరాజు కుమార్తె (13) స్థానిక హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతోంది. కొన్ని రోజులుగా ఆ బాలిక కడుపునొప్పి అని తెలపగా కుటుంబీకులు కుప్పంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చూపించగా అప్పటికే బాలిక ఎనిమిది నెలల గర్భవతి అని వైద్యులు నిర్ధారించారు. ఈ విషయంగా బాలికను తల్లిదండ్రులు ఆరా తీయగా ఈఘాతుకానికి పాల్పడింది గ్రామానికి చెందిన మాజీ వాలంటీర్ వెంకటాచలం అని తెలిపినట్లు కుటుంబీకులు తెలిపారు. తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబ ం పేర్కొంటోంది. కాగా ఈసంఘటనకు బాధ్యుడైన వెంకటాచలంపై పోలీసులు చర్యలు తీసుకోవాలని రజక సంఘం నేత సిఆర్ మోహన్ పేర్కొన్నారు. ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకుని న్యాయం చేయాలని కోరారు.

## గ్రామాల అభివృద్ధి సిఎం చంద్రబాబుతోనే సాధ్యం.



**పెద్దపంజాణి అక్టోబర్ 18 ప్రభాతవార్త :** గ్రామాల అభివృద్ధి సిఎం చంద్రబాబు తోనే సాధ్యమని లింగాపురం సర్పంచ్ రుద్రమూర్తినాయుడు పేర్కొన్నారు. శుక్రవారం లింగాపురం గ్రామంలో ఎమ్మెల్యే అమర్నాథ రెడ్డి చొరవతో మంజూరు అయిన నూతన సిమెంటురోడ్డు నిర్మాణపుపనులను పల్లెపండుగ కార్యక్రమం లో భాగంగా మాజీ ఎంపీపీ భాస్కర్‌రెడ్డి సర్పంచు రుద్రమూర్తి నాయుడు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సంర్భంగా సర్పంచ్ రుద్రమూర్తి నాయుడు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే అమర్నాథ్‌రెడ్డి సహాయ సహకారాలతో లింగాపురం పంచాయతీని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామన్నారు. పచాయతీ అభివృద్ధికి ప్రజలుకూడా తమవంతు సహాయ సహకారాలు అందించాలని ఆయనకోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిదులు పాల్గొన్నారు.

## రేపు ఉచిత కంటివైద్యశిబిరం

**కుప్పం అక్టోబర్ 18 ప్రభాతవార్త :** సాయిమాతా సేవాట్రస్టు జిల్లా అందత్వ నివారణసంస్థ, బెంగుళూరు శంకర కంటి ఆస్పత్రిచే ఈ నెల20వతేది కుప్పం బాలుర హైస్కూల్లో ఉచిత కంటివైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్టు వ్యవస్థాపకులు డి.ఎన్.జగదీష్‌బాబు తెలిపారు. కంటిజబ్బులతో బాధపడేవారు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు వివరాలకు 9391833999 నెంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

## తమిళనాడు చీఫ్‌సెక్రటీరీని కలిసిన ద్రవిడవర్శిటీ వీసీ

**కుప్పం అక్టోబర్ 18 ప్రభాతవార్త :** తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానంధంను ద్రవిడ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ ఆచార్య దొరస్వామి శుక్రవారం కలిసారు. ఈ సందర్భంగా ద్రవిడవర్శిటీలో చదువుతున్న విద్యార్థులకు మరియు తమిళశాఖ ఉద్యోగులకు వేతనాలకు సంబంధించి గతంలో తమిళనాడు ప్రభుత్వం ఏటా బడ్జెట్ కేటాయించేదని పేర్కొన్నారు. అయితే గత నాలుగు సంవత్సరాలుగా తమిళనాడు ప్రభుత్వం నుంచి ద్రవిడవర్శిటీకి ఎటువంటి గ్రాంటును మంజూరుకాలేదని ఆయన చీఫ్ సెక్రటిరీ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై చీఫ్ సెక్రటిరీ సానుకూలంగా స్పందించినట్లు విసీ తెలిపారు. కార్యక్రమంలోతమిలశాఖ హెచ్‌ఓడీ ఆచార్య విష్ణుకుమార్, పిఆర్‌ఓ డా॥గణేష్‌మూర్తి పాల్గొన్నారు.

## అటవీ ప్రాంతానికి చేరిన ఒంటరి ఏనుగు

**కుప్పం అక్టోబర్ 18 ప్రభాతవార్త :** కుప్పం మండలం నూలుకుంట, కంగుంది, నాయనూరు పంచాయతీల్లో హల్‌చల్ చేసిన ఒంటరి ఏనుగు గురువారం అర్ధరాత్రి రామకుప్పం మండలం నారాయణపురం తాండా అటవీ ప్రాంతంలోకి ప్రవేసించింది గురువారం రాత్రి కంగుంది అటవీప్రాంతలో ప్రవేసించిన ఒంటరి ఏనుగును కుప్పం అటవీ అదికారులు సిబ్బంది ట్రాకర్ల సహాయంతో దారిమళ్లించే యత్నాలను ముమ్మరంగా చేపట్టారు. దీంతోకుప్పంమండలఅటవీసరిహద్దుగ్రామాలప్రజలు, రైతులు హర్షం వ్యక్తంచేశారు.

## గోకులం షెడ్ల నిర్మాణాలకు భూమిపూజ



**రామకుప్పం, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** మండలంలోని బళ్ల గ్రామంలో గోకులం షెడ్ల నిర్మాణాలకు రాష్ట్ర నేత మునస్వామి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. రైతులు గోకులం షెడ్ల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు రామూర్తి, నాగభూషణం, నేతలు ఎర్రప్ప, మునిరత్నం, రైతులు పాల్గొన్నారు.

## పంచాయతీ నిధులపై డిఎల్‌పిఒ విచారణ

**రామకుప్పం, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** మండలంలోని బందార్లపల్లి పంచాయతీకి సంబంధించిన నిధుల వినియోగంపై డిఎల్‌పిఒ రాధాకృష్ణ శుక్రవారం సర్పంచ్, కార్యదర్శిని విచారించారు. పంచాయతీ నిధులు దుర్వినియోగం అవుతున్నాయని పనులు చేపట్టకనే నిధులు స్వాహా చేస్తున్నారని ఇటీవల గ్రామస్తులు జిల్లా కలెక్టర్, ఎంపిడిఒకు ఫిర్యాదు చేశారు. దీంతో డిఎల్‌పిఒ విచారణ చేపట్టారు. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని ఆయన తెలిపారు.

## కాణిపాకం ఆలయానికి 150 చిరుచాపలు విరాళం



**కాణిపాకం, అక్టోబర్ 18 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంకు ఓ భకు_డు శనివారం 150 చిరుచాపలను విరాళంగా అందజేశారు. కర్నాటక రాష్ట్ర ముళబాగళ్‌కు చెందిన రఘురామయ్య అనే దాత దేవస్థానం డార్మెంటరీకి భక్తుల సౌకర్యార్థం 150 చిరుచాపలను విరాళంగా అందజేశారు. వీటిని దాతలు ఆలయ ఈఓ పట్టెం గురు ప్రసాద్‌కు అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## నిర్ధిష్ట అభ్యసన వైకల్య పై అవగాహన కల్పిద్దాం



**వెదురుకుప్పం, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** నిర్దిష్ట అభ్యసన (డిస్లెక్సియా) వైకల్యంను ప్రాథమిక స్థాయిలో గుర్తిస్తే అభ్యసన సమస్యలను అధికమించ వచ్చని విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పిద్దామని మండల విద్యాశాధికారి మహేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. ప్రపంచ డిస్లెక్సీయా వారం పురష్కరించుకుని మండలంలోని పచ్చికాపల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో నిర్దిష్ట అభ్యసన సమస్యల పై శుక్రవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులతో కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. మండల విద్యాశా ధికారి దామోదరం, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిద్ధయ్య, సహితవిద్యా ఉపాధ్యాయులు శ్యామల, గుణ, ఐఇడి ఎస్ఎస్ స్పెషల్ టీచర్‌రాజశేఖర్, ఉపాధ్యాయులు. తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పెరుమాళ్ళపల్లెలో సీసీ రోడ్డుకు భూమిపూజ

**వెదురుకుప్పం, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** మండలలోని పెరుమాళ్ళపల్లెలో శుక్రవారం పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా సిమెంటు రోడ్డుకు భూమి పూజ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ఆదేశాల మేరకు అభివృద్ధి కార్యక్రమాలల్లో భాగంగా సిమెంట్ రోడ్డుకు భూమి పూజ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా టీడీపీ మోహన్ మురళి, కార్యదర్శి మండల పార్టీ అధ్యక్షులు లోకనాథ రెడ్డి, స్థానిక నాయకులు రామకృష్ణా రెడ్డి, చంగల్ పండు రెడ్డి, రామంప్రసాద్ రెడ్డి, కృష్ణ ప్రసాద్ రెడ్డి, పద్మనాభ రెడ్డి, తిరుమల్ రెడ్డి, జయరామ రెడ్డి, సచివాలయం డీడీవో ధనలక్ష్మి, ఏపీవో ఇందు, తదితరులు పాల్గొన్నారు.

## పాడిరైతులను ఆదుకునేందుకే గోకులం షెడ్ల నిర్మాణం

– కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్



**కుప్పం, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** కుప్పం నియోజకవర్గంలో ఉన్న పాడి రైతులను ఆదుకునేందుకు సిఎం చంద్రబాబునాయుడు మినీ గోకులం షెడ్లను మంజూరు చేశారని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మల్లానూరు, గరిగచీనేపల్లి, నూలుకుంట గ్రామాల్లో పాడి రైతులు నిర్మించుకుంటున్న గోకులం షెడ్లను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా లబ్దిదారులతో మాట్లాడారు. ప్రభుత్వం తమకు గోకులం షెడ్లను మంజూరు చేసి ఆదుకుంటోందని రైతులు, మహిళలు ఈసందర్భంగా ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు వివరించారు. షెడ్ల నిర్మాణంతో పాడి సంపదకు ఇబ్బందులు తొలగాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకుని అధికారులకు తగు ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, డ్వామాఎపిడి వెంకటరమణ, పశుసంవర్ధకశాఖ ఎడి రెడ్డికుమారి, ఎఇ మధు, మాజీ సర ్పంచ్ రామచంద్ర పాల్గొన్నారు.

## కెసి ఆస్పత్రిలో ఫారిన్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్స



**కుప్పం, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** కుప్పం కెసి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో తొలిసారిగా ఫారిన్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డా॥ మంజునాథ్ పేర్కొన్నారు. 55 ఏళ్ల వయసు గల వ్యక్తి ఐదేళ్లుగా మోకాలి నొప్పితో బాధపడుతూ చికిత్స నిమిత్తం తమ ఆస్పత్రిలో చేరాడన్నారు. అతనికి మహానగరాల్లో భారీ వ్యయంతో నిర్వహించే ఫారిన్ ఇంప్లాంట్ చికిత్సను అతి తక్కువ ఖర్చుతో విజయవంతంగా నిర్వహించామన్నారు. ప్రస్తుతం అతను కోలుకుంటున్నట్లు తెలి పారు. ఈ తరహా శస్త్ర చికిత్సను కుప్పం చరిత్రలో తొలిసారిగా నిర్వహించడం తమకు ఎంతో గర్వకారణమని ఆయన పేర్కొన్నారు.

## చీకటిపల్లిలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ప్రారంభం

**గుడుపల్లె, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** మండలంలోని చీకటిపల్లిలో ఆయుష్మాన్ భారత్ పథకంలో మంజూరైన నిధులతో నూతనంగా నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (విలేజ్ హెల్త్ క్లినిక్)ను ఎపిఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం ప్రారంభించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు బాబునాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జ్ హేమాంబరగౌడు, సర్పంచ్ నారాయణ, మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్, తెలుగుయువత అధ్యక్షుడు వెంకీ, స్థానిక నేతలు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## కళాశాల ప్రిన్సిపాల్ చేతుల మీదుగా పుస్తక ఆవిష్కరణ



**చిత్తూరురూరల్, అక్టోబరు 18 ప్రభాతవార్త:** చిత్తూరు పట్టణం, సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా కళాశాలలో డాక్టర్ షమ్స్ అక్తర్ సంపాదకత్వంలో వెలువరించబడిన 'ప్రేమ్ చంద్రోత్తర్ కహానీ సాహిత్యమే సాంప్రదాయకత: కారన్ ఔర్ పరిణామ్' పుస్తకంను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మనోహర్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, వైస్ ప్రిన్సిపాల్ నరేంద్రలు మాట్లాడుతూ డాక్టర్ షమ్స్ అక్తర్ జాతీయ సదస్సులో సమర్పింపబడిన ఉత్తమమైన పత్రాలన్నింటినీ తమ సంపాదకత్వంలో పుస్తకంగా తీసుకొని వచ్చి కళాశాల మీద అభిమానంతో పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని కళాశాలలో నిర్వహించడం ఎంతో సంతోషదాయకమన్నారు. తెలుగు ఉపన్యాసకులు డాక్టర్ జి ఉషారాణి, ఆంగ్ల ఉపన్యాసకులు డాక్టర్ జి.తిరు కుమార్‌లు మాట్లాడుతూ ఇటువంటి పుస్తకావిష్కరణ సభలు కళాశాలలో నిర్వహించడం వల్ల విద్యార్థులలో కూడా రచన వ్యాసంగం పట్ల ఆసక్తి కలుగుతుందని, ప్రపంచంతో హిందీ భాషా సాహిత్యాలు అన్నింటికన్నా మొదటిస్థానంలో వున్నాయని హిందీభాషకు తమ రచన ద్వారా తోడ్పడిన షమ్స్ అక్తర్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు పురుషోత్తమనాయుడు, కళాశాల గ్రంథాలయాధికారి కుమారి, కళాశాల విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## కదిరి నరసింహస్వామి ఆలయంలో చోరీ



**చౌడేపల్లి, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** మండలంలోని కాటిపేరి పంచాయతీ వడ్డివారిపల్లి వద్దగల కదిరి నరసింహస్వామి ఆలయంలో చోరీ జరిగింది. హుండీని పగులగొట్టి రూ. లక్షలాది రూపాయలు దొంగలించినట్లు గ్రామస్తులు తెలిపారు. గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆలయానికున్న తాళాలు, లోపల హుండీకున్న బీగాలు పగులగొట్టి అందులోని నగదు, బంగారాన్ని దొంగలించుకొని వెళ్ళారన్నారు. ఆలయం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు హుండీ లెక్కింపు జరగలేదనీ, అధిక మొత్తలంలోనే నగదు వుంటుందని వారన్నారు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

## మా భూములను మాకు చూపండి!



**చౌడేపల్లి, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** దశాబ్దాల తరబడి సాగు చేసుకొంటున్నాం మాభూములు మాకు చూపండంటూ తహాశీల్దార్‌ను వేడుకొన్నారు. బాధి ఎల కథనం మేరకు... మండలంలోని పెద్దకొండామర్రికి పంచాయతీ పరిధిలోని గోవిందురాజుచెరువు సమీపంలో కొండామర్రికి చెందిన 4కుటుంబాల వారు దాదాపు 40యేళ్ళనుంచి ప్రభుత్వమిచ్చిన 14ఎకరాలను సాగు చేసుకొంటున్నామనీ, తమ కుటుంబాల్లో 70మంది అదే భూమిపై ఆధారపడి జీవిస్తున్నామన్నారు. అయితే తమ భూముల్లో కొందరు పట్టాలు చేసుకొని అక్రమంగా చొరబడుతున్నారని బాధిత రైతులు లక్ష్మమ్మ, వెంకటలక్ష్మమ్మ, జ్యోతమ్మ, లక్ష్మమ్మలు మొరపెట్టుకొన్నారు. ప్రభుత్వమిచ్చిన సంబంధిత భూమిలను సర్వే చేయించి ఇప్పించాలని తహాశీల్దార్ హనుమంతు నాయక్‌కు వినతిపత్రమందించారు. విచారణ చేసి న్యాయం చేస్తామని ఆయన వారికి హామీ ఇచ్చారు.

## నిర్ధిష్ట అభ్యాస వైకల్యాలపై అవగాహన ర్యాలీ

**చౌడేపల్లి, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** స్థానిక భవిత కేంద్రం పరిధిలో శుక్రవారం నిర్దిష్ట అభ్యాస వైకల్యాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంఇఒలు కేశవరెడ్డి, తిరుమలమ్మల ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ జరిగింది. చదువులో వెనుకబడ్డ విద్యార్థుల్లో 4రకాలకు సంబంధించి లోపాలుంటాయనీ, వాటిని ప్రత్యేక శిక్షణ ద్వారా సరిదిద్దవచ్చన్నారు. భవిత కేంద్రం ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రేపు కాణిపాకంలో సంకటహర గణపతివ్రతం

**కాణిపాకం, అక్టోబర్ 18 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో ఈనెల 20న సంకటహర గణపతివ్రతంను నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్ తెలిపారు. అలాగే రాత్రి7 గంటల నుండి 8 గంటల వరకు స్వామివారికి స్వర్ణరథోత్సవం జరుగుతుందని ఆయన తెలిపారు.

**23న కాణిపాకం హుండీల లెక్కింపు :**

కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో ఈనెల 23న హుండీలు ఈఓ పట్టెం గురుప్రసాద్ తెలిపారు. స్థానిక ఆస్థాన మండపంలో ఉదయం 7 గంటలకు జరిగే హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది తప్పక హాజరు కావాలని కోరారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు

**డక్కిలి, అక్టోబర్18, ప్రభాతవార్త):**



ఉపాధి హామీ నిధులతో మండలంలోని అన్నీ గ్రామాలలో పలు రకాలు అభివృద్ధి పనులు జరుగుతాయని ఉపాధిహామీ ఏపీవో లక్ష్మీనారాయణ తెలియజేశారు. మండలంలోని పాతనాలపాడు, డక్కిలి, శ్రీపురం గ్రామాలలో శుక్రవారం పల్లె పండుగలో భాగంగా ఆయనతో కలిసి పలువురు టీఏలు, టీడీపీ నాయకులు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేశారు. ఏపీవో మాట్లాడుతూ పాతనాలపాడులో రూ.10లక్షలు, శ్రీపురంలో రూ.5లక్షలు, డక్కిలిలో రూ.10లక్షలు అభివృద్ధి పనులకు శంఖు స్థాపన చేసినట్లు వివరించారు ఉపాధి నిధులతో గ్రామాల్లో అవసరమైన మౌళిక వసతులుకల్పిస్తున్నట్లు, పలు సమస్యలు తీరుతాయని తెలియజేశారు. ఈకార్యక్రమాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఉపాధి హామీ ఈసీ దామోదరరాజు, టీఏ గిరి, ఆయా ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

## చుక్కల భూములపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలి

– వైసీపీ నేత వెంకటకృష్ణయ్య ముదిరాజ్



**చిట్టమూరు, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** చిట్టమూరు మండలంలో నెలకొని ఉన్న చుక్కల భూములు సమస్యలపై జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సత్వరం చర్యలు చేపట్టి పట్టాదారులను ఆదుకోవాలని చిట్టమూరు మండలం ఆలేటిపాడు గ్రామానికి చెందిన వైసీపీ నేత ఈగా వెంకటకృష్ణయ్య ముదిరాజ్ కోరారు. చిట్టమూరు మండలంలో ఇప్పటికే యల్లసిరి రెవెన్యూ పరిధిలో ఉన్న వేలాది ఎకరాల చుక్కల భూముల సమస్యలను పరిష్కరించిన జిల్లా అధికారులు చిట్టమూరు రెవెన్యూ పరిధిలోని చుక్కల భూములపై మాత్రం శ్రద్ధ చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చిట్టమూరు రెవెన్యూ పరిధిలోని కొత్తగుంట, చిట్టమూరు, ఆలేటిపాడు గ్రామాల్లో సుమారు 250 ఎకరాల చుక్కల భూములు ఉన్నాయని, తద్వారా ఈ భూములకు సంబంధించి బ్యాంకు రుణాలు పొందలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ వద్ద పట్టాదారు పాస్ పుస్తకాలు ఉన్నప్పటికీ అధికారులు ఈ భూములను మార్చేందుకు వివిధ కారణాలు చూపుతున్నారని, జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులు చుక్కల భూముల సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని వెంకటకృష్ణయ్య ఈ సందర్భంగా అధికారులకు విన్నవించారు.

## ప్రజా సమస్యలు పరిష్కారించాలి

**కోట, అక్టోబర్ 18 ప్రభాతవార్త :**




కోట మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపిపి దాసరి అంజమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సభలో పలువురు సభ్యులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని సమస్యలు పరిష్కారమవుతున్నాయని చెప్పారు. అందువలన ప్రతిపక్ష సభ్యులు కూడా సహకరించాలని అధికారపక్ష సభ్యులు కోరారు. వ్యవసాయం, రెవెన్యూ, పశుసంవర్ధకశాఖ, విద్యుత్, ఆర్టీసీ, ఐసిడిఎస్, ఆరోగ్యం, ఇతర శాఖల గురించి ఆయా శాఖల అధికారులు వివరించారు. ఎంపిడివో వేణు మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలు వలన గామాల్లో పారిశుద్ది పనులు చేపట్టాలాని సూచించారు. అదే విధంగా మంచినీట్లు ట్యాంకులను శుభ్రపరిచి ప్రజలను మంచి నీరు అందించాలని కోరారు. ఈ సమావేశంలో తహాశీల్దార్ జయజయరావు, ఎంపిడిఓ వేణు, ఉపాధ్యాక్షులు ఉప్పల శేషయ్య, పలువురు ఎంపిటిసి సభ్యులు, సర్పచులు జడ్పిటిసి సభ్యులు దాసరి కోటయ్య తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు సమావేశంలో ఇరువురు సభ్యుల మధ్య కొంత వాగ్యావాదం చోటు చేసుకుంది.

## ఉచిత బియ్యం.. మరో నాలుగేళ్లు !

**కోట, అక్టోబర్ 18 ప్రభాతవార్త :**

గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకం కింద కేంద్ర ప్రభుత్వం పేదలకు ఉచిత బియ్యం అందజేస్తోంది. కరోనా విపత్తు కాలం 2020 ఏప్రిల్ నుంచి అమలవుతోంది. కుటుంబంలో ఒకరికి అయిదు కిలోల చొప్పున ఇస్తున్నారు. తొలుత రెండేళ్లే అని ప్రకటించినా పొడిగిస్తూ వచ్చింది. మళ్లీ 2028 వరకు ఈ పథకాన్ని కొనసాగిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవలే ప్రకటించారు. దీంతో పేదలకు ఇంకో నాలుగేళ్లు ఉచిత బియ్యం అందనున్నాయి. జాతీయ ఆహార భద్రత చట్టం( ఎన్ఎఫ్ఎస్ఏ) 4.30,000 కింద రేషన్ కార్డుదారులు ఉండగా ఇందులో ఎన్ఎఫ్ఎస్ఏ కార్డుదారులు సూమారు లక్షా మంది ఉన్నారు. వీరిందరికి ప్రయోజనం కలగనుంది. ఆమేరకు జిల్లా పౌరసఫరాల శాఖ సంబందింత అధికారి తెలిపారుమొత్తం కార్డులు 5,50000 కార్డులు ఉన్నాయోని పేర్కొన్నారు

## వేయింగ్ మిషన్‌లకు సీల్స్ వేసిన అధికారులు



**బాలాయపల్లి, అక్టోబర్ 18 ప్రభాతవార్త :**

తహాశీల్దార్ కార్యాలయంలో రేషన్ షాపు డీలర్ల వేయింగ్ మిషన్లను తనిఖీ చేసి 2024-25 సంవత్సరానికి తూనీకలు కొలతల ఇన్స్పెక్టర్ భరత్ కుమార్ స్టాంపులు సీల్స్ వేశారు. ఇంకా సీల్ వేయించుకొని రేషన్ షాపు డీలర్లు వేయింగ్ మిషన్లకు స్టాంపింగు వేయించుకోవాలి. లేకుంటే అపరాధ రుసుము వేస్తామని తెలిపారు. రేషన్ షాపు యజమానులకు సులభతరంగా ఉండేందుకు ప్రతి మండల కేంద్రం తహాశీల్దార్ కార్యాలయంలోనే క్యాంపులు ఏర్పాటు చేసి సీల్‌స్టాంపులు వేస్తున్నామని ఆయన తెలిపారు. డివిజన్‌లో 500 రేషన్ షాపులు ఉన్నాయి. మండలంలో 38 షాపులకు ఇప్పటి వరకు స్టాంపింగు పూర్తి చేసామని తహాశీల్దార్ పి. శ్రీనివాసులు తెలిపారు.

## లీక్ అయిన గ్యాస్ సిలిండర్ దగ్ధమైన ఇల్లు

**బాలాయపల్లి, అక్టోబర్ 18 ప్రభాతవార్త :**

మండలంలోని సుబ్రమణ్యం గ్రామంలో వంట సిలిలిండర్ లీకేజీ అగ్ని ప్రమాదంతో పల్లిపాటి సిద్ధమ్మ, తిరుపాలయ్య పూరిల్లు దగ్ధం అయింది. సిద్ధమ్మ వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగింది. అగ్నికి ఆహుతై సర్వస్వం కోల్పోయిన బాధితురాలి కుటుంబం వాపోయింది. సిలిండర్ లీకేజీ అగ్ని ప్రమాదంపై పోలీసులు, రెవెన్యూ, ఫైర్ అధికారులకు కుటుంబ సభ్యులు సమాచారం అందించారు. తమను ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు.

## పల్లె పండుగతో గ్రామాల అభివృద్ధి : ఎంపిడిఓ

**బాలాయపల్లి, అక్టోబర్ 18 ప్రభాతవార్త :**



పల్లె పండుగతో గ్రామాలు ఎంతగానో అభివృద్ధి చెందుతాయని మండల అభివృద్ధి అధికారి డిజే వినీల్ కుమార్ తెలిపారు. మండలంలోని బాలాయపల్లి, కడగుంట గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు కోట్ల మూడు లక్షల రూపాయిలతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు చెప్పారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సిమెంట్ రోడ్లకు భూమి పూజ చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు జీవనోపాధి కల్పిస్తున్నట్లు చెప్పారు. ఎన్డీఏ ప్రభుత్వంలో గ్రామాలు ఎంతగానో అభివృద్ధి చెందుతున్నట్లు టిడిపి నాయకులు రాయి సత్యం నాయుడు తెలిపారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అభివృద్ధి పనులు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈవోపిఆర్డి మోహన్ రాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా ఇన్చార్జి మంత్రి కలిసిన ఎమ్మెల్యే

**వెంకటగిరి, అక్టోబర్ 18 ప్రభాతవార్త :**



జిల్లా ఇన్చార్జి, రెవెన్యూ మంత్రి అయిన అనగాని సత్యప్రసాద్‌ను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా ఇన్చార్జి మంత్రిగా నియమితులైన సందర్భంగా ఆయనను పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించారు. అన్న క్యాంటీన్‌ను ప్రారంభిం చేందుకు రావాలని మంత్రిని ఎమ్మెల్యే ఆహ్వానించారు. పలు భూ సమస్యలను ఎమ్మెల్యే రామకృష్ణ మంత్రి దృష్టికి తీసుకుని వెళ్లారు.

## గొర్రెలు, మేకలలో నట్టల నివారణ

**గూడూరు, అక్టోబర్ 18 ప్రభాతవార్త :**



గూడూరు మండలంలోని 1,2,3 వార్డులు, తిప్పవరప్పాడు, పాలిచర్ల, కొండాగుంట, చెన్నూరు గ్రామాల్లో గొర్రెలు, మేకలకు ప్రాంతీయ పశువైద్య శాల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన పశు వైద్య శిబిరంలో నట్టల నివారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు సురేష్, పశు వైద్య సిబ్బంది మోహన్ రెడ్డి, సుదర్శన్ రావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఫోటోలు బహుకరణ

**వాకాడు, అక్టోబర్ 18 ప్రభాతవార్త :**



వాకాడు మండల పరిషత్ కార్యాలయంకు శుక్రవారం టిడిపి బల్లి హర్ష సిఎం, డిప్యూటీ సిఎం ఫోటోలను ఎంపిడిఓ అన్నపూర్ణరావుకు బహుకరించారు. ఎంపిడివో అన్నపూర్ణరావు యువ నాయకుడు హర్షను ఆయన అభినందించారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని వస్తువులు దగ్ధం

**చిల్లకూరు, అక్టోబర్ 18 ప్రభాతవార్త :**



చిల్లకూరు మండలం కడివేడు గ్రామంలో గురువారం రాత్రి 12 గంటలకు రుద్రకోటి ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీంతో ఇంట్లో ఉన్న వస్తువులు ఫ్రిడ్జ్, మిక్సీ, ఫ్యాన్లు, బట్టలు, వరిధాన్యం, తగలబడిందని తెలిపారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు మంటలను ఆర్పి వేశారు. వారికి తీవ్ర నష్టం జరిగిందని బాధితులు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్, ప్రముఖ పారిశ్రామికవేత్త తానంకి నానాజీ తక్షణమే స్పందించి 15 వేల రూపాయిలు టిడిపి నాయకులు పెనుబోలు శ్రీనివాసులు రెడ్డి, బసిరెడ్డి సదానంద రెడ్డిలు వెళ్ళి బాధితులకు సహాయం అందజేశారు.

## పల్లె పండుగ కార్యక్రమంలో అభివృద్ధి పనులు

**చిల్లకూరు, అక్టోబర్ 18 ప్రభాతవార్త :**



పల్లె పండుగ కార్యక్రమంలో శరవేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నదని రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాల లీలావతి పేర్కొన్నారు. మండలంలోని ఒడూరు గ్రామ పంచాయితీలో ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పల్లె పండుగ కార్యక్రమంలో శుక్రవారం రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాల లీలావతి సిసి రోడ్లకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. అదే విధంగా పల్లమాల, వల్లిపేడు ఉడతవారిపాలెం చింతవరం కమ్మవారిపాలెం ఎంఆర్ పల్లి, కలవకొండ, లింగవరం, కాకువారిపాలెం గ్రామంలో నాయకులు సిసి రోడ్లకు నెరవేయకుండా భూమి భూమి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీరాజ్ ఏఈ ఇలియాజ్ అహ్మద్ ఏపివో గిరి నాయకులు పచ్చ వెంకటేశ్వర్ నాయుడు అన్నం మునిశేఖర్ కుమార్ సాయి దొడ్డల నాగరాజు, నందకుమార్ చిట్యాల శ్రీనివాసులు, సురేంద్ర పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ అంతరాయం : ఏఈ

**దొరవారిసత్రం, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** దొరవారిసత్రం మండల పరిధిలో సబ్ స్టేషన్ 33/11 కెవి వివిధ రకాల మరమ్మత్తు పనులు చేయుట కొరకు శనివారం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సప్లై ఉండదని ఏఈ జగదీశ్వర రావు తెలిపారు. దొరవారిసత్రం మండల పరిధిలోని గ్రామాల్లోని ప్రజలందరూ విద్యుత్ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

## సాగులో ఉన్న డికేటి భూములకు పరిహారం ఇవ్వాలి



**కోట, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** కోట మండలం కొత్తపట్నం గ్రామ పంచాయతీలోని గున్నపడియ గ్రామంలో సాగులో ఉన్న డికేటి భూములకు నష్ట పరిహారం ఇవ్వాలని శుక్రవారం స్థానిక తహాశీల్దార్ కె.జయజయరావుకు వినతి పత్రం అంద చేశారు. ఈ సందర్భంగా లబ్దిదారులు మాట్లాడుతూ ఎపిఐసిసి వారు మా భూములను సేకరించుకుని ఉన్నారని వారు గుర్తు చేశారు. పరిహార జాబితాలో మాపేర్లు చేర్చా లని కోరారు. విచారణ జరిపి నాయ్యం చేస్తామని తహాశీల్దార్ జయజయరావు చెప్పారు. తహాశీల్దర్ కలిసిన వారిలో సర్పంచ్ తిరుపాలయ్య, మాజీ జెడ్పిటీసీ సభ్యులు, ఉప సర్పంచ్ ఉప్పల ప్రసాద్ గౌడ్, మండల ఉపాధ్యాక్షులు ఉప్పల శేషయ్య, ఉన్నారు.

## అభ్యసన వైకల్య విద్యార్థులకు అవగాహన

**వాకాడు, అక్టోబర్ 18 ప్రభాతవార్త :**



మండల కేంద్రమైన వాకాడులో శుక్రవారం భవిత పాఠశాలలో అభ్యసన వైకల్య విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంకు ప్రభుత్వ ప్రధాన పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రమీల, ఐఈఆర్‌టి టీచర్ సునీత, జగన్మోహన్ రావు, అంగన్‌వాడి టీచర్స్ మస్తానమ్మ, పాఠశాల చదువుకుంటున్న వైకల్య విద్యార్ధిని విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రమీల మాట్లాడుతూ అభ్యసన వైకల్య విద్యార్థులను గురించి ఆమె మాట్లాడుతూ చదువులో వెనకబడిన విద్యార్థులు నాలుగు రకాలుగా ఉంటారని ఇందులో భాషణ, వైకల్యం, పఠన వైకల్యం, లేఖన వైకల్యం, గణిత పరమైన వైకల్యాలు గురించి పూర్తి స్థాయిలో వివరించారు.

## రాస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



**శ్రీకాళహస్తి, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** రాష్ట్రీయ సేవా సమితి(రాస్) ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.వెంకటరత్నం ఆదేశాను సారం రాస్ మరియు టాటా క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ వైద్యశిబిరాన్ని శుక్రవారం పట్టణంలోని నల్లగంగ మ్మగుడి ఆవరణలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిం చారు. ఈసందర్భంగా రాస్ పొదుపు సంఘాల సంచాలకులు వి.నాగరాజు మాట్లాడుతూ పనిభారంతో ఆరోగ్యంపై శ్రద్ధ లేకుండా అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో టాటా ట్రస్టు వైద్యులు వెంకయ్యబాబు బృందం, రెడ్డి కుమారి, మెహతాజ్, మహేంద్ర, రాస్ సిబ్బంది, ముఖేష్‌కుమార్, రాజేశ్వరి, జ్యోత్స్న, పొదుపు సంఘాల సభ్యులు, లీడర్లు పాల్గొన్నారు.

## కరాటే పోటీల్లో ఎంజిఎం విద్యార్థిని ప్రతిభ



**తొట్టంబేడు, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** పట్టణంలోని ఎంజి ఎం పాఠశాల విద్యార్థులు అండర్-12 బాలికల విభాగంలో అబ్దుల్‌కలాం ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ 2024లో జరిగిన ద్వితీయ స్థాయి స్థానంలో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపారు. అండర్-14 బాలుర విభాగంలో 8వ తరగతి చదువుతున్న పిఎంకె.తేజో మారుతీప్రసాద్ రాష్ట్రస్థాయిలో రెండో స్థానం సాధించగా, అదేవిధంగా అండర్ బాలికల విభాగంలో ఆరో తరగతి చదువుతున్న బి.మీనాక్షి రాష్ట్ర స్థాయి తృతీయ స్థానం సాధించింది. చెన్నైలో జరిగిన పోటీల్లో ఎంజిఎం విద్యార్థులు తమ సత్తా చాటారు. ఈసందర్భంగా ఎంజిఎం గ్రూప్ డైరెక్టర్ గుడ్లూరు ఐశ్వర్య మాట్లాడుతూ తమ విద్యాసంస్థల్లో ఒక్క విద్యలోనే కాకుండా క్రీడల్లో కూడా రాణిస్తున్నట్లు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో అటవీశాఖ వాచర్ మృతి



**తొట్టంబేడు, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** మండలం లోని పెద్దకన్నలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాళహస్తి అటవీశాఖ కార్యాలయంలో ఫారెస్టు వాచె ర్‌గాపనిచేస్తున్న బి.సిద్దయ్య కుమారుడు బి.వెం కటేశు (35) మృతి చెందాడు. గురువారం అర్ధరాత్రిట రోడ్డు ప్రమాదంజరగడంతోబసవయ్యపాలెంకుఎస్‌టి కాలనీకి చెందినబి.వెంకటేశులను పోలీసులు ప్రమాదం జరిగిన చోటును చూపించమని పోలీసు జీపులో ఎక్కించుకుని వెళ్ళినట్లు సమాచారం. దీంతో వెంకటేశులు పోలీసు వాహనంలో కొత్తకన్నలి వద్ద ప్రమాదం జరిగిందని చూపుతుండగా ఎదురుగా వస్తున్న లారీ పోలీసువాహనాన్నిఢీకొట్టడంతోవెంకటేశు అక్కడికక్కడే మృతిచెందగా కానిస్టేబుళ్ళు అనిల్, సుబ్రమణ్యంలు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో టుటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆలయంలో కన్నులపండువగా ఉత్సవాలు



**శ్రీకాళహస్తి, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** శ్రీకాళహ స్తీశ్వరాలయంలో శుక్రవారం దేవేరి జ్ఞానప్రసూనాంబికా అమ్మవారి ఉత్సవమూర్తిని ఆలయంలోని ప్రదోష నందివాహనంపై అధిరోహించి ఆలయంలోనే గ్రామో త్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లోకేష్‌యాదవ్ పలువురు ఆలయాధికారులు పాల్గొన్నారు.

## పంచాయతీల అభివృద్ధిపై ఉపసర్పంచ్‌లకు శిక్షణ



**తొట్టంబేడు, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** పంచాయతీల అభివృద్ధిపై ప్రణాళికలు సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో మండలంలోని 27 పంచాయతీల్లో ఉన్న ఉపసర్పంచ్‌లకు ఎంపిడిఓ సురేంద్రనాథ్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే శిక్షణ కార్యక్రమంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందినపుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఐదు అంశాలపై శిక్షణ కార్యక్రమాలను ఉపసర్పంచ్‌లకు ఇస్తున్నామన్నారు. పంచాయతీలో ఏఏ పనులు చేయాలో అన్న అంశాలపై గ్రామంలో సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు వార్డు సభ్యులు ప్రజల సమక్షంలో గ్రామ పంచాయతీల్లో చేపట్టాల్సిన పనులకు సంబందించి తీర్మానం చేయాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ మధుసూధన్, సీనియర్ అసిస్టెంట్ జనార్ధన్, జూనియర్ అసిస్టెంట్ మునిరత్నం, పంచాయతీ కార్యదర్శులు జ్ఞానప్రకాష్, అంకయ్య, పంచాయతీలకు చెందిన ఉపసర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## బృహదీశ్వరునికి ఇక నిత్య పూజలు,అభిషేకాలు



**శ్రీకాళహస్తి,అక్టోబర్ 18 ప్రభాతవార్త :** ప్రముఖ శైవ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తి పరిసరాల్లో వేలాది శైవాలయాలున్నాయి. అయితే గతంలో ధూప దీప నైవేద్యాలకు దిక్కులేక పలు ఆలయాలు మూతపడ్డాయి. మరి కొన్ని ఆలయాలు శిథిలమయ్యాయి.ఈ నేపథ్యంలో బహదూరుపేటలోని కుందేటి వారి వీధిలో అద్భుతమైన రాగివర్ణం కల్గిన శివలింగం,శిథిలావస్థలో ఉన్న ఆలయంను కొంత కాలం క్రితం స్థానికులు మరమ్మత్తులు చేసారు.అయితే ఈ ఆలయంలో వెలసిన లింగం పేరు ఎక్కడ లేదు.ఈ దివ్యక్షేత్రానికి సంబంధించిన వివరాలను శ్రీకాళహస్తీశ్వరాలయ ప్రధానార్చకులను కలిసి చర్చించగా ఆయన తమ వద్ద ఉన్న పురాతన కాలం నాటి తాళపత్ర గ్రంధాల అధారంగా ఈ ఆలయానికి 'బృహదీశ్వరా లయం' అని నామకరణం చేసారని స్థానికులు వివరించారు. ఆలయాన్ని జీర్ణోద్ధారణగావించుకున్న స్థానికులు ఇక్కడి స్వామిని కొలవటానికి తీర్మానించారు.స్వామికి పూజా అభిషేకాలు,అర్చనలు,స్వామి వారి దర్శనం ఏర్పాటు చేసారు. ఇక్కడ వెలసిన స్వామి మహిమాన్వితుడని కోరిన కోర్కెలు తీర్చే ఇలవేలుపుఅని ఈ దయాకరుని దర్శించుకొని పునీతులు కావాలని నిర్వాహకులు శుక్రవారం వివరించారు.

## కనకదుర్గ అమ్మవారి సేవలో చిత్తూరు ఎమ్మెల్యే



**చిత్తూరురూరల్, అక్టోబరు 18 ప్రభాతవార్త:** విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువు తీరిన శ్రీ దుర్గా మల్లేశ్వర అమ్మవారని చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్, చిత్తూరు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చెరుకూరి వసంత కుమార్‌లు శుక్రవారం ఉదయం దర్శించుకొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు పరిపాలనలో ఆంధ్రప్రదేశ్ ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## సమాచార చట్టం సామాన్యుని చేతిలో పాసుపతాస్త్రసం

**చౌడేపల్లి, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** సమాచార చట్టం సామాన్యుల చేతిలో పాసుపత్రాస్త్రమని పుంగనూరు వ్యవసాయశాఖ సంచాలకుడు శివకుమార్ అన్నారు.చట్టం అమలు తీరు, అధికారుల పాత్రలను గురించివివరించారు.మాజీసర్పంచుపూలచంద్రమౌళి,వ్యవసాయాధికారిణిజ్యోతమ్మ, రైతులు పాల్గొన్నారు.

## తవణంపల్లెలో ఘనంగా డిస్లెక్సియా దినోత్సవం

**తవణంపల్లె, అక్టోబర్ 18 ప్రభాతవార్త:** మండల కేం ద్రం తవణంపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలోని భవిత కేంద్రంలో డిస్లెక్సియా దినోత్సవంను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చదవడం, రాయడంలో వెనుకబడిన దివ్యాంగులకు ప్రోత్సాహం అందించే ఉద్దేశ్యంతో ఈఅవగాహన కార్యక్రమంను నిర్వహించారు. ఎంఈఓ త్యాగరాజులురెడ్డి, పాఠశాల హెచ్‌ఎం దేవరాజులురెడ్డి, సహిత విద్యా ఉపాధ్యా యులు టి.దేవేంద్ర, ఎం.డిల్లీఫ్, ఐఈడీఎస్‌ఎస్ ఉపాధ్యాయుడు నాగభూషణం, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా ద్రౌపదమ్మ ఆలయంలో పూజలు



**వెదురుకుప్పం, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని భరతం మిట్ట ద్రౌపది సమేత ధర్మరాజుల ఆలయంలో శుక్రవారం ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు మంత్రోచరణ నడుమ పూజలు చేపట్టి ఆలయంకు విచ్చేసిన భక్తులకు దైవదర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంకు సిరిపిరెడ్డి శివశంకర్‌రెడ్డి యశోధమ్మ, త్రిలోక సుందరి లవకుమార్ రెడ్డిలు ఉభయదాతలుగా వ్యవహారించారు. ఆలయ ధర్మకర్త పేట నీరజారా ధాకృష్ణారెడ్డి, ముఖ్యకార్య నిర్వహకులు కృష్ణారెడ్డి, ఆంజనేయులురెడ్డి, నరసింహారెడ్డి, జయరాం, జీవన్‌బాబు, లోకనాధ రెడ్డి, భక్తులుపాల్గొన్నారు.

## గిరిజనుల జాబితాలో ఇతర కులాల్ని చేర్చితే సహించం



**కుప్పంరూరల్, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** గిరిజన కులాల్లో ఇతర కులాలను ప్రభుత్వాలు చేర్చితే సహించేది లేదని ఆలిండియా గిరిజన బంజారా సేవా సంఘం అధ్యక్షుడు రవినాయక్ ప్రకటనలో పేర్కొన్నారు. వాల్మీకి కులస్తులను గిరిజనుల్లో చేర్చాలనే డిమాండ్ సరైనది కాదన్నారు.

## పారిశుధ్య కార్మికులకు పక్కాగా వేతనాలు : ఛైర్మన్

**చిత్తూరు, అక్టోబర్ 18 ప్రభాతవార్త:** చిత్తూరు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వ నిబంధనల మేరకు పక్కాగా కనీస వేతనాలు అదించాలని సఫాయి కర్మచారి కమీషన్ ఛైర్మన్ ఎం.వెంకటేశన్ అన్నారు. చిత్తూరు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో శుక్రవారం సఫాయి కర్మచారి కమీషన్ ఛైర్మన్ ఎం.వెంకటేశన్ పారిశుధ్య కార్మికుల స్థితిగతులను తెలుసుకోవడానికి పర్యటించారు. ఛైర్మన్ స్పందిస్తూ చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహించే పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వ నిబంధనల మేరకు జీతాలు ప్రతి నెలా చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రిలో కార్మికులకు అవసరమైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు.సఫాయి కర్మచారి కమీషన్‌ఛైర్మన్‌వెంకటేశన్‌తోడిసిహెచ్‌ఎస్‌డాక్టర్‌ప్రభావతి,మున్సి పల్‌కమీషనర్‌నరసింహప్రసాద్‌పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధే టీడీపీ ప్రభుత్వ లక్ష్యం



**విజయపురం, అక్టోబరు 18 ప్రభాతవార్త:** గ్రామాల అభివృద్ధి తెలుగుదేశం పార్టీ లక్ష్యమని టీడీపీ చిత్తూరు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్.బాల సుబ్రహ్మణ్యం రాజు పేర్కొన్నారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని పాత మహారాజపురం దళితవాడలో 3 లక్షల రూపాయలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎం.వి.ఎన్.రాజేంద్ర, సర్పంచ్ బొబ్బిలి, పంచాయతీ కార్యదర్శులు సురేంద్రకుమార్, చంద్రశేఖర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ అజిత్, టీడీపీ నాయకులు శేఖర్ రాజు, కపిల్, అశోక్, జాన్, ఉపాధి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## 22న ప్రభుత్వ ఐటిఐలో జాబ్‌మేళా

**కార్వేటినగరం,అక్టోబరు 18 ప్రభాతవార్త:** కార్వేటినగరం ప్రభుత్వ ఐటిఐలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లా యిమెంట్ ఎక్స్చేంజ్,సీడప్ డిఆర్‌డిఎ సంయుక్తంగా ఈనెల 22వ తేదీన జాబ్‌మేళా నిర్వహిసున్నట్లు ఐటిఐ ప్రిన్సిపాల్ పి.గణేష్ తెలిపారు. వివరాలకు సంప్రదించ వలసిన ఫోన్‌నెం. 8142509017

## డిస్లెక్సియాపై అవగాహన



**కార్వేటినగరం,అక్టోబరు 18 ప్రభాతవార్త:** కార్వేటినగరం భవిత కేంద్రంలో శుక్రవారం అభ్యాసన వైకల్యాల పట్ల ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లి దండ్రులకు, సమాజానికి అవగాహన కల్పించేందుకు శుక్రవారం డిస్లెక్సియాపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జి.కోటీశ్వరరావు, జి.రేఖ, సిఆర్‌పిలు,విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ డిగ్రీ కళాశాలలపై చర్యలు తీసుకోండి



**తిరుపతి విద్య,అక్టోబర్ 18 ప్రభాతవార్త:** ఎపి స్టూడెంట్స్ జెఎసి ఎస్వీ యూనివర్సిటీ అధ్యక్షులు మల్లి ఉపేంద్ర ఆధ్వర్యంలో ఈ రోజు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అప్పారావుకి ప్రైవేట్ కళాశాలలపై ఫిర్యాదు చేయడం జరిగిందని. ఆయన మాట్లాడుతూ ఎస్వి యూనివర్సిటీ పరిధిలోగల డిగ్రీ కళాశాలలో చదువుతున్నటువంటి రెండవ సంవత్సరం మూడవ సంవత్సరం విద్యార్థులకు సంబంధించి నటువంటి సెమిస్టర్ ఫీజులకు గడువు తేదీ సమీపిస్తుంది. అయినప్పటికీ ప్రైవేటు కళాశాల యాజమాన్యం డిగ్రీ విద్యార్థులను గత సెమిస్టర్ ఫీజులు పూర్తిగా చెల్లించినట్టయితేనే బీకు సెమిస్టర్ ఫీజులు కట్టించుకుంటామని లేనిపక్షంలో ఫీజులు కట్టించుకోమని విద్యార్థులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఏ ఒక్క విద్యార్థికి నష్టం జరిగిన ఏపి స్టూడెంట్స్ జెఎసి ఆందోళన చేస్తుందని చెప్పి మీ ద్వారా తెలియజేస్తున్నాము అని చెప్పారు.

## ఘనంగా వాల్మీకి జయంతి మహోత్సవం

**తిరుపతి విద్య,అక్టోబర్ 18 ప్రభాతవార్త:** జాతీయ సంస్కృత విశ్వవిద్యా లయంలో పురాణ ఇతిహాస విభాగం ద్వారా ఆదికవి వాల్మీకి జయంతి మహోత్సవ కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయంలోని వాల్మీకి మండపం నందు ఘనంగా నిర్వహించడం జరిగింది. విశ్వఇద్యాలయ వైస్-ఛాన్సలర్ ప్రొ.జి.ఎస్. ఆర్ కృష్ణమూర్తి ముఖ్యఅతిధిగా విచ్చేసి వాల్మీకి మహర్షుల వారి విగ్రహానికి పూజాదికం నిర్వహించి,వాల్మీకి అనుగ్రహాన్ని పొందడం జరిగినది. ఈ కార్యక్రమంతా పురాణ ఇతిహాస విభాగం అధ్యక్షురాలు డా.పరమిత పండా నిర్వహించడం జరిగింది. విశ్వవిద్యాలయం అకాడమిక్ డీన్ ప్రొ.రజినీకాంత్ శుక్లా,వేదభాష్య విభాగాధ్యక్షులు డా.నిరంజన్ మిశ్రా,సాహిత్య ఆచార్యులు డా.బలిచక్రవర్తి మరియు పురాణేతిహాస విభాగ అధ్యాపకులు,విభిన్న విభాగాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## 25 ఏప్రిలియా ఆర్ఎస్ 457ను మార్కెట్‌లోకి విడుదల

**తిరుపతి విద్య,అక్టోబర్ 18ప్రభాతవార్త:** పియాజియో ఇండియా యొక్క ప్రతిష్టాత్మక ద్విచక్ర వాహన బ్రాండ్‌లు వెస్పా,ఏప్రిలియాలకు అధీకృత రిటైలర్ అయిన నికీ మోటార్స్ శుక్రవారం స్థానిక రేణిగుంటరోడ్‌లో ఉన్న తమ ప్రీమియం షోరూమ్ లో కందాల పునీత్ కృష్ణకు నగరం యొక్క 25 ఏప్రిలియా ఆర్ ఎస్ 457ను డెలివరీ చేశారు. ఈ వహనాన్ని తిరుపతి డిప్యూటీ కలెక్టర్ చంద్రశేఖర్‌నాయుడు నికీ మోటార్స్ సీఈవో నాగభూషణ్‌రెడ్డితో కలిసి అందజేశారు. కందాల పునీత్ కృష్ణ మాట్లాడుతూ ఏప్రిలియా ఆర్ ఎస్ 457 ని ఇంటికి తీసుకెళ్లడానికి నేను చాలా సంతోషిస్తున్నామన్నారు.

## ఇదేనా రుయాలో అధికారుల నిర్లక్ష్యం



**తిరుపతి,అక్టోబర్ 18ప్రభాతవార్త:** రాయలసీమకే తలమానికంగా ఉన్న రుయా ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలోని ఇంటర్నల్‌రోడ్లు దెబ్బతిన్నాయి. ప్రధానంగా డయాలసిస్ రోగులు వార్డుకెళ్ళి వైద్యచికిత్సలకోసం మార్గంలో రోడ్డు గుంతలమయమైంది. ఇంకుడుగుంత కూడా పూడ్చకుండా వదిలేయడంతో రోగులు, వారి బంధువులు వీల్‌ఛైర్‌లలో, స్ట్రక్చర్‌లలో రోగులను తీసుకెళ్ళాలన్నా కష్టంగా మారింది.మరీ ఇప్పటికైనా బాగుచేస్తారా చూడాల్సిందే.

## నీటి ఉధృతిని పరిశీలించిన అధికారులు



**పాకాల, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** పాకాల మండలం పాకాల చుట్టు పక్కల వంకలు, వాగులను శుక్రారం ఉదయం ఐదు గంటల నుంచే పాకాలలో వివిధ శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరివేక్షిస్తూ పరిస్థితులను చక్కదిద్దుతున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గత నాలుగు రోజులుగా జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో పలు చెరువులలో నీరు చేరిందని, వంకలు, కాలువలలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని పారిశుధ్య కార్మికుల సాయంతో శుభ్రం చేస్తున్నామన్నారు. చంద్రగిరి ఎమ్మెల్యే ఎప్పటికప్పుడు అధికారులని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తూ, పరివేక్షిస్తున్నారని అన్నారు.

## ఈ-క్రాప్ నమోదుపై అవగాహన



**గుడిపాల, అక్టోబర్ 18 ప్రభాతవార్త:** పాపసముద్రం రైతు సేవా కేంద్రంలో శుక్రవారం మండల వ్యవసాయ అధికారి మాధవి ఆధ్వర్యంలో రైతులకు ఈ-క్రాప్ నమోదుపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎఓ మాధవి మాట్లాడుతూ ఈ-క్రాప్ యాప్‌లో 450 ఎకరాలకు సంబంధించి 344 మంది రైతుల ఇకెవైసీ పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిట్టిబాబు, వీఏఏ తులసీరెడ్డి, రైతులు గణేష్, శివలింగారెడ్డి, పయణి, ఐజాక్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన

**గుడిపాల, అక్టోబర్ 18 ప్రభాతవార్త:** ప్రతి ఒక్క రైతు సమాచార హక్కు చట్టంపై పూర్తి అవగాహన కలిగి వుండాలని మండల వ్యవసాయ అధికారి మాధవి పేర్కొన్నారు. మండలంలోని బసవపల్లి, నంగమంగళం పంచాయతీల్లో శుక్రవారం రైతులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం జరిగింది.

## సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



**శ్రీరంగరాజపురం, అక్టోబర్ 18 ప్రభాతవార్త:** మండలంలోని చెక్కమడుగు కాలనీలో సిమెంటు రోడ్డు నిర్మాణానికి శుక్రవారం ఎంపిడిఓ మోహన్ మురళీ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మోహన్ మురళీ మాట్లాడుతూ ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమం ద్వారా ఉపాధి, పంచాయతీ నిధులతో సిమెంటు రోడ్లు, మురికి కాలువల నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఓ చంద్రశేఖర్, టిఏ రామ్మూర్తి, పంచాయతీ కార్యదర్శి కోదండరెడ్డి, ఇజనీరింగ్ అసిస్టెంట్ ఉమ, ఎఫ్ఎ ధనరాజ్, టిడిపి ఎస్సీ సెల్ కన్వీనర్ కుమార్, టిడిపి నాయకులు వెకంటేష్‌రెడ్డి, రఘునాథరెడ్డి, సుబ్బరాయుడుశెట్టి, మారయ్య, ఉపాధి సిబ్బంది, దేశం నాయకులు పాల్గొన్నారు.

## ఏకాగ్రతతో మోకరిల్లాలి!

**శ్రీకాళహస్తి,అక్టోబర్ 18 ప్రభాతవార్త :** జామియా మస్జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల తరువాత ఆయన ప్రసంగిస్తూ మసీదులంటే అల్లాహ్ ముందు ఏకాగ్రతతో మోకరిల్లి తనను తాను సమర్పించుకునే పవిత్ర స్థలం అని హాఫీజే అన్నారు. మహమ్మద్ ప్రవక్త కాలంలో మసీదులు ఖర్జూరపు చెట్ల కింద నమాజు ఆచరించే వారని గ్రంధాలు చెబుతున్నాయన్నారు. ఆయన హయాంలో పసిపిల్లలను మసీదుల్లో అనుమతించే వారన్నారు. ప్రతి రోజూ ఆయన ఉదయం 80 ఆయత్‌లతో నమాజ్ ఆచరించే వారని ఓ రోజు నమాజు సమయంలో ఓ చిన్నారి ఏడ్పు విని ఆయన నాలుగు ఆయత్‌లతో ముగించారన్నారు. అంతేకాక నమాజులు చదువుతుంటే ఎదురుగా పిల్లలు పరుగెత్తడానికి అభ్యంతరం లేదని వివరించారు.

## ఈనెల 20 నుంచి జూడో రాష్ట్ర స్థాయి పోటీలు



**శ్రీకాళహస్తి, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** ఈనెల 20 నుంచి రెండు రోజుల పాటు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర స్థాయి జూడో అండర్-17 స్కూల్‌గేమ్స్ పోటీలను తిరుపతి జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి బాబు ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి తెలిపారు. ఈపోటీలకు 13 జిల్లాల నుంచి 130మంది బాలురు, 130మంది బాలికలు పాల్గొంటున్నారని ఎంపికైన వారిని రాష్ట్ర స్థాయి జాతీయ స్థాయిలో బాలుర జట్టు జమ్మూ కాశ్మీర్‌లోను, బాలికల జట్టు అస్సాంలోను జాతీయ స్థాయిలో పోటీల్లో పాల్గొంటారని ఆమె తెలిపారు.

# తిరుపతి డివిజన్

## విద్యుత్ చార్జీలు పెంచొద్దు : సీపీఎం




**కేవీబీపురం, అక్టోబరు 18 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగు నెలల్లోనే విద్యుత్‌చార్జీలు పెంచేందుకు అనుమతి ఇవ్వడం దారుణమని తిరుపతి జిల్లా సీపీఎం కార్యవర్గ సభ్యులు దాసరి జనార్దన్ విమర్శించారు. విద్యుత్ చార్జీల పెంపుకు నిరసనగా కేవీబీ పురం విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు గత ప్రభుత్వం విద్యుత్‌చార్జీలపైన బాదుడే బాదుడని విమర్శించిన చంద్రబాబు నేడు అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే 8114 కోట్ల రూపాయలు ఇంధన సర్దుబాటు చార్జీల పెంచడంతో... నేడు ఆన్‌లైన్‌లో ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్న సందర్భంగా సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో జిల్లాలో అన్ని మండలాల్లో ఆందోళనకు పిలుపునిచ్చిందని తెలిపారు. అనంతరం వినతిపత్రం కేవీబీ పురం మండల విద్యుత్ ఏఈ మునికుమార్‌కి అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల పార్టీ కార్యదర్శి శంకరయ్య, బాలయ్య, కన్నయ్య, లక్ష్మయ్య రామారావు, ఎర్రప్ప పాల్గొన్నారు.

## పంచాయతీలను అభివృద్ధి చేయడం టీడీపీకే సాధ్యం



**కేవీబీపురం, అక్టోబరు 18 ప్రభాతవార్త:** కేవీబీ పురం మండలంలోని తిమ్మసముద్రం పంచాయతీలో పల్లె పండుగ వారోత్సవాలను తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, స్థానిక సర్పంచ్ దొరబాబునాయుడు ఆధ్వర్యం లో ఘనంగా నిర్వహించారు. అనంతరం భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో సత్యవేడు నియోజకవర్గ కో-ఆర్డినేటర్ శ్రీపతిబాబు, ఎంపీడీవో రాధారాణి, తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రామాంజులనాయుడు, రాష్ట్ర బీసీ ప్రధాన కార్యదర్శి మునస్వామి యాదవ్, తిరుపతి పార్లమెంట్ రైతు అధ్యక్షులు కనపర్తి గోపినాథ్‌రెడ్డి, యువత అధికార ప్రతినిధులు సురేష్‌రెడ్డి, చందు, వెంకటకృష్ణయ్య, సత్యవేడు ఎస్సీసెల్ అధ్యక్షులు సాదు, జనసేన అధ్యక్షుడు థామస్, బీజేపీ పార్టీ అధ్యక్షుడు శేఖర్, మాజీ సర్పంచ్ బత్తులు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రాజేంద్ర, పీఆర్ఏఈ పవన్, ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ వల్లెమ్మ, సెక్రటరీ, వీఆర్‌వో, సచివాలయ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అరుణ్‌కుమార్‌కు ఘన సత్కారం



**రేణిగుంట, అక్టోబరు 18 ప్రభాతవార్త:** రేణిగుంట (తిరుపతి) సీఆర్ఎస్‌లో డిప్యూటీ సీపీవోగా విధులు నిర్వహిస్తున్న అరుణ్‌కుమార్ సికింద్రాబాద్‌కు బదిలయ్యారు. సీఆర్ఎస్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు, కార్మికులకు ఆయన ఎనలేని సేవలు చేశారని సీఆర్ఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి విజయ కుమార్ అన్నారు. రేణిగుంట రైల్వేస్టేషన్‌లో సికింద్రాబాద్ వెళుతున్న అరుణ్‌కుమార్‌ని విజయకుమార్ ప్రత్యేకంగా కలసి సన్మానించి వీడ్కోలు పలికారు.

## డొమెస్టిక్ గ్యాస్ వినియోగిస్తున్న వారిపై కేసు నమోదు



**నగరి, అక్టోబరు 18 ప్రభాతవార్త:** డొమెస్టిక్ గ్యాస్ వినియోగిస్తున్న షాపులపై తిరుపతి ప్రాంతీయ నిఘా, అమలు అధికారి ఎస్పీ కరీముల్లా షరీఫ్ ఆదేశాల మేరకు శుక్రవారం ఆకస్మిక దాడి నిర్వహించారు. పోలీసు ఇన్‌స్పెక్టర్ వెంకటరవి, ఎస్.చంద్రశేఖర్, స్థానిక రెవెన్యూ అధికారులు డీటీ కె.మేఘవర్ణం, వీఆర్‌వో ఎం.కేశవులు ఒక బృందంగా వెళ్లి నగరిలోని తిరుత్తణి రోడ్డులో గల హనీఫా హోటల్, సుదర్శన్ స్వీట్స్, జబ్బర్ హోటల్, ఆర్‌ఆర్‌హోటల్, మాషా అల్లా బిర్యాన్ని సెంటర్,విరాట్ టీ స్టాల్‌లో దాడులు జరిపి వారు అక్రమంగావినియోగిస్తున్నడొమెస్టిక్‌గ్యాస్ సిలిండర్లను సీజ్ చేసి యజమానులపై కేసులు నమోదు చేశారు.

## డైస్లెక్సియా వ్యాధిపై అవగాహన ర్యాలీ



**నగరి, అక్టోబరు 18 ప్రభాతవార్త:** డైస్లెక్సియా(అభ్యసనా వైకల్యం) వ్యాధిపై భవిత సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ర్యాలీ నిర్వహించి పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇ.పార్వతిదేవి, ప్రత్యేక బోధకులు సంగీత, భవాని, ఎం.సతీష్ నాయక్, సీఆర్పీలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అభ్యాసన వైకల్యంపై అవగాహన ర్యాలీ



**నింద్ర,అక్టోబరు 18 ప్రభాతవార్త :** అభ్యాసన వైకల్యం గల పిల్లలు మూడు రకాలు అందులో డిస్లాక్సియా వైకల్యం ఒక రకం ఆసమస్య ఉన్న పిల్లల గురించి అవగాహన కల్పించడం కోసం సమగ్ర శిక్ష అమరావతి వారు ఈనెల 14వతేది నుంచి 18వ తేది వరకు 5రోజులు డిస్లెక్సియా అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. దానిలో భాగంగా నింద్ర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ర్యాలీ ఏర్పాటు చేయడం జరిగింది. ఈకార్యక్రమమునకు ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖాధికారులు శ్రీధర్‌రాజు మాట్లాడుతూ ప్రత్యేకావసరాల గల పిల్లలు 21 రకాలు ఉన్నారు. మండల విద్యాశాకాధికారి వసుమతి,నింద్ర ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుశివయ్య,సహితఉపాధ్యాయులురాజేష్,వెంకటేశులు,వాసు,విద్యార్థులుతదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ నిర్మాణాలకు నిధులు మంజూరు : డీఈ



**సత్యవేడు, అక్టోబరు 18 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా సత్యవేడు ఆర్‌డబ్ల్యుఎస్ డివిజన్‌పరిధిలో 12 డ్రైనేజీ నిర్మాణ పనులకు నిధులు మంజూరైనట్టు స్థానిక గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖ డీఈ శైలజ పేర్కొన్నారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో ఈ నిధులు మంజూరైందన్నారు. ఈ పనులన్నీ ఉపాధిహామీ పథకం నిధులతో చేపట్టడం జరుగుతుందన్నారు.ఇప్పటికేపల్లెపండుగపంచాయతీ వారోత్సవాల్లో కొన్ని డ్రైనేజీ పనులు ప్రారంభమైందన్నారు.

## పల్లె పండుగ వారోత్సవాలు



**సత్యవేడు, అక్టోబరు 18 ప్రభాతవార్త:** సత్యవేడు మండలం పీవీపురం పంచాయతీలో పల్లె పండుగ ఉత్సవాలను గ్రామ నాయకులు, సచివాలయ సిబ్బందితో కలసి ఐదు లక్షల గ్రాంట్‌తో సిమెంటు రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ ఉత్సవాలకు రాష్ట్ర వాణిజ్య విభాగ ఉపాధ్యక్షులు కొండూరు బాలరాజు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దామురాజు, జయరామశెట్టి, వెంకటేష్, వెంకటరత్నయ్య, సిద్ధమనాయుడు, మహిళా అధ్యక్షురాలు నిర్మల, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## చంద్రగిరి సబ్ రిజిస్ట్రసార్ కార్యాలయంలో సిబిఐ అధికారులు

### -నేషనల్ హైవే అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్ కేసు దర్యాప్తు



**చంద్రగిరి, అక్టోబర్ 18 ప్రభాతవార్త:** స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం సిబిఐ అధికారులు సోదాలు నిర్వహించారు. చిత్రదుర్గ నేషనల్ హైవే అథా రిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ రావులూరి శ్రీనివాసులు నాయు డుపై నమోదైన అక్రమ ఆస్తుల కేసు దర్యాప్తులో భాగం గా సిబిఐ అధికారులు డిఎస్పీ మహేష్, సిఐ షైనీ ఇక్క డ రికార్డులు తనిఖీ చేశారు. శ్రీకాళహస్తికి చెందిన శ్రీనివాసులు నాయుడు అక్రమ ఆస్తులకు సంబం ధించి ఇక్కడఏవైనారిజిస్ట్రేషన్లుజరిగాయాఅనేకోణంలోదర్యాప్తుచేశారు.అయితే తమ కార్యాల యంలోశ్రీనివాసులు నాయుడుకుసంబంధించి ఎటువంటి రిజిస్ట్రేషన్లు జరుగలేదని సబ్ రిజిస్ట్రార్ కొండారెడ్డి తెలిపారు.

## నేటి నుంచి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కుంభాభిషేకం

**పుత్తూరురూరల్, అక్టోబరు 18 ప్రభాతవార్త:** పుత్తూరు మండల పరిధిలోని తిరుపతి-చెన్నై జాతీయ రహదారి గొల్లపల్లి గ్రామ సమీపంలో వెలసిన శ్రీ వల్లిదేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయ పుష్కర కుంభాభిషేకం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

## సర్దుబాటు పేరిట విద్యుత్ చార్జీలు పంచొద్దు : సీపీఎం




**పుత్తూరురూరల్, అక్టోబరు 18 ప్రభాతవార్త:** ఈ సందర్భంగా విద్యుత్ చార్జీల పెంపుకు నిరసనగా పుత్తూరు ఏడీ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తక్షణమే ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రం విద్యుత్‌శాఖ పుత్తూరురూరల్ ఏఈ, జేఈవో కు అందజేశారు. కార్యక్రమంలో పుత్తూరు సీపీఎం కార్యదర్శి వెంకటేష్, మండల కార్యదర్శి విజయ్, శివ, రమేష్, నరసింహులు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యావ్యవస్థను భ్రష్టుపట్టిస్తారా..?

**-విద్యాశాఖ అధికారులపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం**



పెద్దపంజాణి అక్టోబర్ 18 ప్రభాతవార్త : మండలంలో ప్రభుత్వవిద్యావ్యస్థను విద్యాశాఖ అధికారులు భ్రష్టుపట్టిస్తున్నారని ప్రజాప్రతినిధులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.శుక్రవారం ఎంపిపి ఎన్.రెడ్డెప్ప అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది.ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ మండలంలోని తుర్లపల్లి, నగిరేపల్లి, గ్రామాల్లోఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 4,5 లేదా 6గురు మాత్రమే ఉన్నారని విద్యాశాఖ అధికారులు పాఠశాలను బలోపేతం చేయడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని కెలవాతి ఎంపిటిసి సభ్యులు సుబ్రమణ్యం ప్రశ్నించారు. సాధారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో 25నుంచి30మంది విద్యార్థులు నిర్దిష్టంగా ఉండాల్సి ఉండగా ఈ పాఠశాలల్లో కేవలం నామమాత్రపుసంఖ్యలో విద్యార్థులువున్నా ఎందుకు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల సంఖ్య తక్కువగాఉందని ప్రభుత్వ పాఠశాలలు మూసివేస్తే విద్యార్థుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. శంకర్రాయలపేటలో సైతం ప్రభుత్వజూనియర్ కళాశాలలో 6మంది విద్యార్థులు ఉండం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మండలంలో పల్లెపండుగ కార్యక్రమాన్ని అన్ని పంచాయతీలో నిర్వహించాలని ఎంపిపి రెడ్డెప్ప సూచించారు. పంచాయతీలకు ఉపాధిహామీ నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందని ఈ నిధులతో గ్రామాల్లో అవసరమైన సిసిరోడ్లు,డ్రైనేజీలు,అంగన్వాడీ కేంద్రాలకు మరుగుదొడ్లు నిర్మించుకోవాలని ఆయన సూచించారు. గతంలో ఎన్టీఆర్ హౌసింగ్ పథకంలో ఇళ్ళుమంజూరై అసంపూర్తిగా ఉన్న ఇళ్ళ నిర్మాణాలను లబ్దిదారులు పూర్తిచేస్తే ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుందని దీనికోసం లబ్దిదారుల్లో అవగాహన కల్పించేందుకు ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు హౌసింగ్ ఇన్చార్జ్ ఏఈ బాలచందర్ పేర్కొన్నారు. ఎంపిపి రెడ్డెప్ప మాట్లాడుతూ. వాతావరణంలో మార్పులు వర్షాలుకురిసిన నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులు,సర్పంచులు ప్రత్యేకశ్రద్ద చూపాలని ఆయన సూచించారు. వైద్యాఆరోగ్య సిబ్బంది సైతం ప్రజలకు అంటువ్యాదులపై అవగాహన కల్పించాలన్నారు.అనంతరం వివిధఅంశాలపై చర్చించారు.ఈ సమావేశంలో ఎంపిడిఓ బాలాజీ,ఎస్ఐ సహదేవి వివిధశాఖల అధికారులు, సర్పంచులు,ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైద్యశాలను 50 పడకల స్థాయికి పెంచాలి

**-మంత్రికి భాజపా నేత కోటీశ్వరరావు వినతి**



కోట,అక్టోబర్ 18 ప్రభాతవార్త : కోటలోని 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని 50 పడకల ఆసుపత్రి స్థాయికి పెంచాలని భాజపా సినియర్ నేత కె.కోటీశ్వరరావు రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు వినతి పత్రం అంద చేశారు. శుక్రవారం మంత్రిని ఆయన విజయవాడలోని కలిశారు. అనంతరం మంత్రిని కోటీశ్వరరావు సన్మానించారు. ఈ సందర్భంగా జనాభా పెరిగినందున తీర ప్రాంతమైన కోట కు వాకాడు, చిట్టమూరు, చ్లికూరు ఓజిలి మండలాల ప్రజలు సగం మంది వస్తుంటారని పేర్కొన్నారు. కోట వ్యాపారం కేద్రం మైనందన దాదాపు నియోజకవర్గంలో సగం మంది కోట ఆసుపత్రికి వస్తుంటారని గుర్తు చేశారు. అదే కాకుండా కేంద్ర, రాష్ట్రలకు సంబంధించి కంపెనీలు కూడా ఉన్నాయని అందులో వందలాది మంది కార్మికులు పని చేస్తుంటారని తెలిపారు. ఈ నేపధ్యంలో జనాభా పెరిగి నందను ఆసుపత్రి స్థాయిని కూడా పెంచాలని కోరారు. అదే విధంగా స్థాప్‌కు డాక్టర్స్ క్వార్టస్ నిర్మాణం చేపట్టాలని కోరడం జరిగిందన్నారు. ఆ మేరకు జరగనున్న బడ్జెట్‌లో నిధులు మంజూరు చేయించాలని కోరడం జరిగిందని కోటీశ్వరరావు తెలిపారు.

## విద్యుత్ చార్జీలు తగ్గించకపోతే ఆందోళన ఉధృతం చేస్తాం



వెంకటగిరి, అక్టోబర్ 18 ప్రభాతవార్త : పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించకపోతే సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన ఉధృత్తం చేస్తామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి వడ్డేపల్లి చంగయ్య తెలిపారు. సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో వెంకటగిరి విద్యుత్ కార్యాలయం వద్ద ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో ప్రజలపై భారాలు మోపడం ఆపాలని డిమాండ్ చేస్తూ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందనపు సర్దుబాటు చార్జీల పేరుతో, ట్రూ అప్ చార్జీలు పపేరుతో 8114 కోట్ల రూపాయిలు ప్రజల మీద బారాలు మోపడం ఆపాలని డిమాండ్ చేశారు. టిడిపి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యుత్ వినియోగదారులపై కరెంటు బాధుడు గురించి ఆనాటి వైసిపి ప్రభుత్వాన్ని విమర్శించారని అన్నారు. కానీ ఇప్పుడు అధికారంలోకి వచ్చాక టిడిపి కూటమి ప్రభుత్వం ఉమ్మడిగా విద్యుత్ వినియోగదారులపై కరెంటు బాదుడు మొదలుపెట్టారని అన్నారు. ఇందనపు సర్దుబాటు చార్జీలు, ట్రూ అఫ్ చార్జీల పేరుతో వినియోగదారుల మీద బారం మోపడానికి రంగం సిద్ధం చేశారని అన్నారు. ఈ రోజు విద్యుత్ నియంత్రణ మండలి మొక్కుబడి తంతులాగా బహిరంగ విచారణ జరుపుతూ ఉందని విమర్శించారు. ప్రజ, కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలు అవలంభిస్తే ఆందోళన కార్యక్రమాల ను ఉదృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సిహెచ్ రమణయ్య, నాగరాజు, రాజయ్య, ధనంజయ్య, పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## నిర్దిష్ట అభ్యాస, వైకల్యాలపై అవగాహన ర్యాలీ




సూళ్లూరుపేట, అక్టోబర్ 18 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలోని భవిత దివ్యాంగుల పాఠశాలలో నిర్దిష్ట అభ్యాస వైకల్యాలపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భవిత కేంద్రం సహిత విద్య ఉపాధ్యాయురాలు విపి భార్గవి సంబంధిత అంశంపై అవగాహన కల్పించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులు ఎవరైతే ఉన్నారో వారిలో అభ్యాసనలో ఐదు రకాలకు సంబంధించి లోపాలు ఉంటాయని, ఆ వైఫల్యాలను ప్రత్యేక శిక్షణ ద్వారా సరిదిద్దుకోవచ్చని ఆమె విద్యార్థులకు సూచించారు. వారిని ఎవరూ తక్కువచేసి చూడకుండా నిర్దిష్ట అభ్యాస వైకల్యాలు కల వారిలో చాలామంది మంచి మేధస్సు కలిగి ఉంటారని, వారి సామర్థ్యాలను గుర్తించి ప్రోత్సహిస్తే సమస్యలను అధిగమించి బాగా చదువుకుంటారని తెలిపారు. ఈ విద్యార్థులు ముద్రించబడిన పుస్తకాలను చదవడం, చేతితో రాయడం వంటి పనులను చేయడంలో సమస్యలను ఎదుర్కొంటారని, కంప్యూటర్, డిజిటల్ పరికరాలను ఉపయోగించి వాటిలోని అప్లికేషన్ సహకారంతో ఈ అడ్డంకులను అధిగమించవచ్చని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఎన్.సాయి సంధ్య, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శులకు ఘనసత్కారం



తవణంపల్లె, అక్టోబర్ 18 ప్రభాతవార్త: మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ అరగొండ కార్యదర్శిగా పనిచేస్తూ బదలీపై వెళుతున్న చైతన్యకుమార్, నూతనంగా బాధ్యతలు చేపట్టిన మురుగేష్‌లను గ్రామ సచివాలయ, పంచాయతీ సిబ్బంది శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఇక్కడ ఇన్చార్జి కార్యదర్శిగా పనిచేస్తున్న చైతన్యకుమార్ ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ఎస్.ఆర్.పురం మండలంకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో యాదమరి మండలం మాదిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న మురుగేష్‌ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్వర్తులు జారీ చేశారు. ఈమేరకు ఆయన పంచాయతీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈనేపథ్యంలో బదిలీపై వెళుతున్న చైతన్యకుమార్, నూతన కార్యదర్శి మురుగేష్‌లను పంచాయతీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదరి ్శ మురుగేశన్, సర ్పంచ్ మల్లుదొరై ప్రశాంత్‌కుమార్, సచివాలయం కార్యదర్శి మహేష్‌కుమార్, అకౌంటెంట్ త్రివేణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మునగాకుతో ఆరోగ్యం పదిలం



కార్వేటినగరం,అక్టోబరు 18 ప్రభాతవార్త: మునగాకును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకో వాలని ఐసిడియస్ ప్రాజెక్టు అధికారిణి ఎ. పద్మసునంద తెలిపారు. కార్వేటి నగరం మండలం కొల్లాగుంట అంగన్ వాడీ కేంద్రములో విలేజ్ హెల్త్ న్యూట్రీషన్ డే కార్యక్రమం నిర్వహిం చారు. ఆమె మాట్లాడుతూ మునగ వల్ల ఎన్నో ఆరోగ్యప్రయోజనాలు ఉందన్నారు. మునగాకు పొడి తయారీ విధానం, దాని యొక్క ఉపయోగాలను వివరించారు. వారంలో రెండు,మూడు రోజులు మునగకాయ,మునగాకులతో వంటలు చేసుకోగలిగితే మంచి ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఈ విషయాలను గర్భవతులు, బాలింతలు, పిల్లల తల్లులకు వివరించడం జరిగింది. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు యస్.శ్యామిని, ఇ.ఇందిర, యం.భారతి,అంగన్‌వాడీ కార్యకర్త,తల్లులు హాజరయ్యారు.

## అక్రమాల వెనుక ఎవరు వున్నా చర్యలు

**- ఇసుక, నాటుసారాపై ఉక్కుపాదం**

**- పాలసముద్రం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ మణికంఠ చందోలు**



పాలసముద్రం, అక్టోబర్ 18 ప్రభాతవార్త: పాలసముద్రం మండలం తమిళనాడు రాష్ట్రానికి సరిహద్దులో వుంది. ఇక్కడి నుండి ఇసుక అక్రమ రవాణా, నాటుసారా తయారీ అధికంగా జరిగే అవకాశాలు వున్నాయి. వీటి వెనుక ఎంతటి వారు వున్నా చర్యలు తీసుకోవాలని ఎస్పీ మణికంఠ చందోలు పోలీసులను ఆదేశించారు. పాలసముద్రం పోలీస్ స్టేషన్‌ను గురువారం ఎస్పీ మణికంఠ చందోలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మణికంఠ చందోలు తమిళనాడుకు సరిహద్దుగా మండలం వుండటంతో ఇసుక అక్రమార్కులు ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని వీరిపై పిడి యాక్ట్ నమోదు చేసి భారీ జరిమానా విధించాలని ఆదేశించారు. ఇక్కడ ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపితేనే అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడానికి అవకాశం వుంటుందన్నారు. అలాగే మండల పరిధిలో నాటుసారా తయారీ, విక్రయాలపై ఫిర్యాదులు వస్తున్నాయని, దీనికి కట్టడి చేయడానికి పక్కా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ స్టేషన్‌లో పలు రికార్డులను తనిఖీ చేశారు. కేసుల దర్యాప్తు విషయంలో ఎక్కడ ఆలసత్వం ప్రదర్శించరాదని, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులను సత్వరం పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు.

## రైతులకు అండగా నిలుస్తున్న సిఎం చంద్రబాబు

**- ఎపిఎస్‌ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం**



కుప్పంరూరల్/ గుడుపల్లె/ శాంతిపురం, అక్టోబర్ 18 ప్రభాతవార్త : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతులకు అండగా నిలుస్తున్నారని ఎపిఎస్ ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. శుక్రవారం కుప్పం మండలం కంగుంది, గుడుపల్లె మండలం సోడిగాని పాళ్యం , శాంతిపురం మండలం కురుబూరు గ్రామాల్లో జరిగిన పల్లె పండగ కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉపాధిహామీ నిధులతో నిర్మిస్తున్న గోకులం షెడ్ల నిర్మాణాలకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుప్పం ప్రాంతంలో ఉన్న పాడి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ద్వారా గోకులం షెడ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమాల్లో మండల పార్టీ అధ్యక్షులు ప్రేమ్‌కుమార్, బాబు నాయుడు, విశ్వనాథనాయుడు, మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్, ఎంపిడిఒలు సాయిలహరి, పిఆర్‌కుమార్, సర్పంచులు ధనశేఖర్, నారాయణ, లక్ష్మి మురుగేష్, వైస్ సర్పంచ్ తిరుపతి, నేతలు విసి మంజునాథ్, దివాకర్, రాజేంద్ర, హేమాంబర గౌడు, మునాఫ్, చలపతి,బసవరాజు, జయరాజ్, కుమార్, మురళి తదితరులు పాల్గొన్నారు.

## ఐఎఎస్ అధికారి సామాన్యుడిగా మారిన వేళ

**- నేలపై కూర్చుని అంగన్‌వాడీ చిన్నారుల చదువుల పరిశీలన !!**



కుప్పం/శాంతిపురం, అక్టోబర్ 18 ప్రభాతవార్త : ఆయన యువ ఐఎఎస్ అధికారి.. ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక చొరవ.. కుప్పం ప్రాంత అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషి ప్రశంసనీయం.. సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో పగలురాత్రి కష్టపడి కుప్పం అభివృద్ధికి సంబంధించి విజన్ డాక్యుమెంట్ 2029ను తన సీ ్వయపర్యవేక్షణలో రూపొందించిన సమర్థ వంతమైన అధికారి.. ఎక్కడ పనిచేసినా విధుల్లో తనదైన ముద్ర వేశారు.. ఆయనే కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్. కుప్పం నియోజకవర్గంలో గత నాలుగు నెలలుగా ఆయన కడ ప్రాజెక్ట్ అభివృద్ధి అధికారిగా పనిచేస్తూ అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తున్నారు. అలాంటి ఐఎఎస్ అధికారి శుక్రవారం ఓ సామాను ్యడిగా మారి అంగన్‌వాడీ కేంద్రంలో చదువుకుంటున్న చిన్నారులతో మమేకమై ఆకట్టుకున్నారు. శుక్రవారం శాంతిపురం మండలం బడుగుమాకులపల్లి, పోడూరు అంగన్‌వాడీ కేంద్రాలను కడ ప్రాజెక్ట్ అధికారి వికాస్ మర్మత్ ఆకస్మికంగా సందర్శించారు. తాను కూడా చిన్నారులతో సమానంగా నేలపై కూర్చుని పిల్లలు ఎలా చదువుతున్నారనే విషయాన్ని గుర్తించి అంగన్‌వాడీ కార్యకర్తలకు తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం, బియ్యం, కందిపప్పు, వంటనూనెలు సరిగ్గా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యుద్దీపాలు ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించారు.

## అన్నమాచార్యలో జాతీయ స్థాయి సింపోసిజం తృష్ట




రేణిగుంట, అక్టోబరు 18 ప్రభాతవార్త: ప్రభాతవార్త: రేణిగుంట మండలం అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయి సంపోసిజం తృష్ట టూకే 24 ప్రారంభోత్స వ కార్యక్రమం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు, ప్రొఫెసర్లు, హెచ్‌వోడీలు హాజరయ్యారు. ముందుగా కళాశాల ప్రిన్సి పాల్ నాథమునిరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాథమునిరెడ్డి మాట్లాడుతూ ఎంపిక చేయబడిన 500 మంది విద్యార్థులకు అనేక సాంకేతికపరమైన విషయాలను తెలియజేయడమే కాకుండా అధ్యాపకులు సమక్షంలో ఈవెంట్లను కండక్ట్ చేయాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 18,19 తేదీల్లో విద్యార్థులు తమ రూపొందిన ప్రాజెక్టులను, వాటి వివరాలను సమర్పించాలన్నారు. వీటిలో అనేక సాంకేతికపరమైన అంశాలతో కూడిన నమూనాలతో పాటు నిధులు సమీకరణ తదితర విషయాలను పొందుపరచాలని చెప్పారు. విద్యార్థులు ఒకరిని మించి ఒకరు మిన్నగా నమూనాలను రూపొందించాల్సి న అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీఈసీ విభాగాధిపతి పుష్పలత, కళాశాల యాజమాన్యం, బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## అనాధ పిల్లలకు చేగు ప్రశాంత్ గుప్తా అన్నదానాలు



చంద్రగిరి, అక్టోబర్ 18 ప్రభాతవార్త: అనాథ పిల్లలకు, వృద్ధులకు, అన్నదానాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా రాయల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్, చేగు గ్రూపు సంస్థల అధినేత, వైసిపి వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు చేగు ప్రశాంత్ గుప్తా తన జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. తమ అభిమాన నాయకుడు, ఆత్మీయ అన్నయ్య జన్మదిన వేడుకలను "టీమ్ చేగు" సభ్యులు నిరాడంబరంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం చేగు ప్రశాంత్ గుప్తా తిరుణ్ణామలైలోని ఆలయ పరిసరాలలోని నాలుగు ప్రదేశాలలో భక్తులకు అన్నదానం, మదనపల్లిలో ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదానం, భద్రాచలం ఏజెన్సీలో టీమ్ చేగు సభ్యుడు ఉడిపి రాజు ఆధ్వర్యంలో గిరిపుత్రులకు దుప్పట్లు, అన్నదానం, చంద్రగిరి నాగయ్యగారిపల్లి వద్ద గల అరుణోదయా వృద్ధాశ్రమంలో వృద్ధులకు టీమ్ చేగు సభ్యుడు జల్లా జనార్ధన్ రెడ్డి అన్నదానం, బెంగుళూరులోని ఆడిసొండట్టిలో గల సింఫోణి ఆశ్రమంలో ప్రత్యేక ప్రతిభావంతులు, వృద్ధులకు స్థానిక సింగేణీ అగ్రహార సర్పంచ్ ఎస్.కె.గౌరీష్ ఆధ్వర్యంలో అన్నదానం జరిపించారు. తన పుట్టిన రోజున సుమారు 3 వేల మందికి పైగా వివిధ ప్రాంతాలలోని అభాగ్యులకు అన్నదానాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతృప్తి నిచ్చిందన్నారు. ఈ సందర్భంగా అభిమానులు, స్నేహితులకు, టీమ్ చేగు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, గురుమూర్తి రెడ్డి, వినోద్ రెడ్డి, గుణసాయి, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలకు అండగా నిలబడాలి... న్యాయం చేయాలి

**-పార్టీ నేతలకు సిఎం చంద్రబాబు నిర్దేశం**





తిరుపతి,అక్టోబర్ 18ప్రభాతవార్త: క్రమశిక్షణకు మారుపేరైన తెలుగుదేశం పార్టీకి ప్రాణసమానమైన కార్యకర్తల సంక్షేమాన్ని ఆయా ప్రాంతాల, నియోజకవర్గాల నేతలు పట్టించుకోవాలని, వారికి న్యాయం చేయాలని ముఖ్యమంత్రి, టిడిపి జాతీయఅధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పార్టీ నేతలకు నిర్ధేశం చేశారు. కార్యకర్తలు కష్టకాలంలోనూ పార్టీని నమ్ముకుని బాధలు పద్దారని, అలాంటివారి కష్టాన్ని గుర్తించి తగిన న్యాయం చేసేందుకు నేతలు సిద్దంగా ఉండాలన్నారు. టిడిపి పదవుల కోసం కాదని, ప్రజల కోసం దేశ రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించిందన్నారు. టిడిపి రాష్ట్రనేతలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు, ఎమ్మెల్సే లు,ఎంపిలు, ఎమ్మెల్యేలతో కలసి శుక్రవారం మంగళగిరిలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గత ఐదేళ్ళలో అనేక కష్టాలు పడిన, వైసిపి నేతల చేతుల్లో దారుణంగా బాధలు పడిన వారి శ్రమను గుర్తించుకుంటున్నామన్నారు. అన్ని విధాలా నష్టపోయారని, త్యాగాలు చేశారన్నారు. పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావడానికి కార్యకర్తలు, ఆయా నియోజకవర్గాల నేతలు కీలకంగా కష్టపడ్డారన్నారు.వారికి అండగా నిలబడి న్యాయం చేస్తేనే మంచి జరుగుతుందన్నారు. గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించిందని, నాశనం చేసిందని చంద్రబాబు నేతలకు వివరించారు. 125రోజుల పాలనలో మనం చేసిన మంచి పనులను ప్రజల్లోకి తీసుకెళ్ళడంలో కార్యకర్తల పాత్ర ఎంతైనా ఉందన్నారు. క్రమశిక్షణతో ప్రజల నమ్మకాన్ని నిలబెడతామని బాబు హితవుచేశారు. తిరుపతి నుండి ఇన్‌ఛార్జి సుగుణమ్మ హాజరయ్యారు. ఎన్నికల హామీల్లో మేనిఫెస్టోను అమలుచేసేలా చూస్తున్నామని, కొన్ని హామీలు త్వరలోనే ప్రజలకు అమలుచేస్తామన్నారు.

## అంతరాష్ట్ర టువీలర్ దొంగలు అరెస్ట్

**- 12లక్షల విలువ చేసే టువీలర్లు స్వాధీనం !!**



శాంతిపురం, అక్టోబర్ 18 ప్రభాతవార్త : వివిధ రాష్ట్రాల్లో ద్విచక్రవాహనాలను చోరీ చేసే ముఠాను అరెస్ట్ చేసినట్లు రూరల్ సిఐ మల్లేష్ యాదవ్, ఎస్సై నరేష్ పేర్కొన్నారు. శుక్రవారం రాళ్లబూదుగూరు పిఎస్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. శాంతిపురంలోని అపోలో మెడికల్స్ వద్ద నిలిపి ఉన్న ఓ టువీలర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని బాధితుడు ఫిర్యాదు చేశాడన్నారు. కుప్పం డిఎస్పీ పార్థసారథి ఆదేశాలతో తాము, గుడుపల్లె ఎస్సై శ్రీనివాసులు బృందంగా ఏర్పడి కేసు దర్యాప్తు ప్రారంభించామన్నారు. గురువారం రాళ్లబూదుగూరు సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు మూడు టువీలర్లలో వస్తూ తమను చూసి పారిపోయే యత్నం చేయగా వారిని పట్టుకుని విచారించగా టు వీలర్ల చోరీల కేసులు వెలుగు చూశాయన్నారు. శాంతిపురం మండలం కడపల్లి పంచాయతీ కదిరి ఓబనపల్లికి చెందిన మధు (20), నవీన్‌కుమార్ (20), సందీప్ (19)లు తామే ఈ చోరీలకు పాల్పడినట్లు అంగీకరించారన్నారు. వీరిలో మధు ఆటో డ్రైవర్ కాగా సందీప్ డెలివరీ బాయ్‌గా పనిచేసేవాడన్నారు. నిందితులనుంచి 12లక్షల విలువ చేసే 12 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండుకు తరలించినట్లు తెలిపారు. కాగా నిందితులు వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడ్డారన్నారు.అంతరాష్ట్ర దొంగలను పట్టుకున్న పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు అభినందించారు.